
www.flashindianews.com
FLASH INDIA NEWS
# ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO. APTEL/2010/33229
TELANGANA RISING 2047
సంపుటి : 16 | సంచిక :179 | గురువారం 21.08.2025 | ఎడిటర్ :కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

# హైదరాబాద్‌ను ఇలానే వదిలేద్దామా..

## మూసీ ప్రక్షాళన చేసి నైట్ మార్కెట్ అభివృద్ధి

- ట్రిపుల్ ఆర్, ఎలివేటెడ్ కారిడార్లతో మెట్రోను కనెక్ట్ చేస్తం
- 2034లోగా ఫ్యూచర్ సిటీ పూర్తి చేసి తీరుతం
- అప్పుడు ప్రపంచమంతా మనవైపే చూస్తుంది
- సగటు జీవులకు సొంత ఇంటి కల నెరవేరాలంటే నగరం విసరించాలె.
- గచ్చిబౌలిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- సబ్ రిజిస్ట్రార్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ కు భూమి పూజ




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :**

హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజ ల కు సౌక ర్యవంతంగా ఉండేలా ప రిపాల న కు ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీలో భాగంగా 30 కోట్లు ఈ భవన నిర్మాణానికి అపర్ణ కన్స్ట్రక్షన్ కేటాయించిందన్నారు. నిజాం నవాబులు 400 ఏళ్ల చరిత్ర ఉన్న నగరంలో నిర్మించారు.. మాదాపూర్, కొండాపూర్, వట్టి నాగులపల్లి వరకు అభివృద్ధి చేసేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు పలువురు ముఖ్యమంత్రులు కృషి చేశారు.. ప్రపంచంలోని 500కు పైగా కంపెనీలు ఇక్కడే ఉన్నాయి.. ఆనాడు రాజీవ్ గాంధీ కంప్యూటర్ ను దేశానికి పరిచయం చేశారు.. పీవీ నర్సింహారావు స్పెషల్ ఎకనామిక్ జోన్ ను మంజూరు చేశారు.. నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. మిగితా 02 పేజీలో...



## 21 ఏండ్లకే ఎమ్మెల్యేగా పోటీకి చాన్స్!

తెలంగాణ శాసన సభలో చట్ట సవరణ చేస్తం.
రాహుల్ గాంధీ ప్రధాని కాగానే అమల్లోకి తెస్తం
యువతను రాజకీయాల్లో ప్రోత్సహించడమే లక్ష్యం
రాజీవ్ కృషితోనే స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు చట్టసభల్లో
మహిళా రిజర్వేషన్ల బిల్లు వెనుక సోనియా కృషి
రాజీవ్ గాంధీ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి 02

రాహుల్ ప్రధాని అవ్వగానే.. బిల్లు పెడతాం

## ఏ పార్టీ కూడా మాకు బాస్‌లు కారు..

### ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా కంచె ఐలయ్యను పెట్టొచ్చు కదా!

2 లక్షల టన్నుల యూరియా ఇచ్చినోళ్లకే మా మద్దతు

- బీసీ అభ్యర్థిని పోటీలో ఎందుకు పెట్టలే?
- రేవంత్ పెట్టిన వ్యక్తిని మేం వ్యతిరేకిస్తం
- ఏ కూటమీ మమ్మల్ని సంప్రదించలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఎన్నికల తేదీ నాటికి మా వైఖరి ప్రకటిస్తం



ఉపరాష్ట్రపతి ఎన్నికలో బీఆర్ఎస్ మద్దతుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో రెండు కూటమి పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయని వెల్లడించారు. కానీ బీఆర్ఎస్ పార్టీ సర్వ స్వతంత్ర్యమైన పార్టీ అని స్పష్టం చేశారు. మాకు ఢిల్లీలో బాస్‌లు లేరు.. ఏ పార్టీ కూడా మాకు బాస్‌లు 03



## ఎన్డీఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్ నామినేషన్

**న్యూఢిల్లీ :**

ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీఏ కూటమి తరపున సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేశారు. నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, అమిత్ షా, గడ్కరీ హాజరయ్యారు. మిగితా 03 పేజీలో...

నామినేషన్పై సంతకం చేసిన ప్రధాని మోదీ
రేపే నామినేషన్ వేయనున్న ఇండియా కూటమి అభ్యర్థి
వచ్చేనెల తొమ్మిదిన ఉప రాష్ట్రపతి పదవికి పోలింగ్ ..

## భారీగా పెరిగిన టమాటా ధర..



- తెలుగు రాష్ట్రాల్లో భారీగా పెరిగిన టమాటా ధరలు..
- రిటైల్ మార్కెట్‌లో 100కు చేరువలో కిలో టమాటా..
- మార్కెట్లో డిమాండ్‌కు సరిపడా రాని టమాటా..
- ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న టమాటా పంట.. 05

## మేడారం జతరకు రూ.150 కోట్లు మంజూరు

- శాశ్వత నిర్మాణాల కోసం మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు
- సీఎంకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు



02


## మహిళా పోలీస్‌లకు యూనిఫార్మ్ ఉండాలి



- మహిళా పోలీసులకు ప్రత్యేక గ్రీవెన్స్
- తమిళనాడు తరహాలో సమస్యల
- యూనిఫామ్స్ పరిష్కారానికి కృషి మంత్రి సీతక్క 02

## ఉగ్రరూపం దాల్చిన గోదావరి..

- భద్రాచలం వద్ద డేంజర్ బెల్స్
- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- ఉప్పొంగుతున్న ఉపనదులు సురక్షిత ప్రాంతాలకు ముంపు బాధిత ప్రజలు
- కృష్ణానదిలోనూ పెరిగిన వరద ప్రవాహం సాగర్ మొత్తం గేట్లు ఖుల్లా 05



## ఢిల్లీ సీఎంకు చేదు అనుభవం..

### చెంప దెబ్బ కొట్టి, జుట్టు లాగిన యువకుడు

- ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి ఘటన రాజకీయ వర్గాలను కుదిపేసింది.
- భద్రత మరింత కట్టుదిట్టం చేయగా, బీజేపీ, కాంగ్రెస్, ఆప్ నేతలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- జనసభకార్యక్రమంలో ఘటన
- ఆస్పత్రి పాలైనా ముఖ్యమంత్రి
- పోలీసుల అదుపులో నిందితుడు 05



## లోక్‌సభ ముందుకు 3 కీలక బిల్లులు..

### తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విపక్షాలు

30 రోజులు జైల్లో ఉంటే పదవులు గోవిందా
సీఎంలను తొలగించేందుకు కేంద్రం కుట్ర: ఒవైసీ

లోక్ సభలో మరోమారు గందరగోళం నెలకొంది. మూడు బిల్లులను కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. విపక్ష సభ్యులు కేంద్రమంత్రి అమిత్ షా పై పేపర్లు చించి విసిరేయడంతో సభలో గందరగోళం నెలకొంది. ఆన్ లైన్ గేమింగ్ బిల్లు, ప్రధాని ముఖ్యమంత్రుల ఉద్వాసన బిల్లు, జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా బిల్లును సభలో ప్రవేశపెట్టగా విపక్షాలు ఆందోళన చేపట్టాయి. అధికార, విపక్షాల సభ్యుల మధ్య సభవాయిదా పడింది. ఆన్ లైన్ గేమింగ్ ప్రమోషన్ నియంత్రణ బిల్లును కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ ప్రవేశపెట్టగా.. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు, 130వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్. షా సభలో ప్రవేశపెట్టారు. ఈ మూడు బిల్లుల్నీ విపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించడంతో. పాటు.. కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లును... 03

- ప్రవేశపెట్టిన అమిత్ షా.. వ్యతిరేకించిన విపక్షాలు
- కాగితాలు చించి అమిత్ షాపై వేసిన విపక్ష ఎంపీలు
- గందరగోళం మధ్య లోక్సభ వాయిదా..
- లోక్ సభలో బిల్లును ప్రవేశపెట్టిన అమిత్ షా ప్రధాని, సీఎం, మంత్రులకు వర్తింపు
- ఆన్లైన్ గేమింగ్, జమ్ము కశ్మీర్కు రాష్ట్ర హోదా బిల్లులు సైతం
- పదవుల గోవిందా బిల్లును వ్యతిరేకిస్తున్న విపక్షాలు..



## మద్యం షాపుల టెండర్లకు నోటిఫికేషన్ విడుదల

### వైన్స్ షాపుల కోసం దరఖాస్తు ఫీజు 3 లక్షలు

(డిసెంబర్ 1 నుంచి కొత్త పాలసీ)

- రాష్ట్ర వ్యాప్తంగా 2620 వైన్స్ షాపులు
- 5 వేల జనాభా ఉన్న షాపులకు రూ. 50 లక్షల ఫీజు
- జీహెచ్ఎంసీ పరిధిలో రాత్రి 11 వరకు వైన్సు్ల ఖుల్లా
- గ్రామాల్లో రాత్రి 10 గంటలకు క్లోజ్ చేయాలన్న సర్కారు
- షాపుల కేటాయింపులో గౌడ్స్, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు
- గెజిట్ విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం 05



## యూరియా కొరత లేదు

### కాంగ్రెస్ నేతల మాటలను రైతులు నమ్మే పరిస్థితిలో లేరు

- కేంద్రం నుంచి యూరియా వస్తోంది.
- దేశంలో ఎవరైనా ఎక్కడైనా జీవించొచ్చు
- ఈ నినాదం ఎవరు తీసుకున్నాసరికాదు
- యూరియా మీద కేంద్రంపై అసత్య ప్రచారం
- కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది తప్పులు, అప్పులే
- బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు

మార్వాడీ గో బ్యాక్ వెనుక అర్బన్ నక్సల్స్!

మార్వాడీ గోబ్యాక్ నినాదం వెనుక అర్బన్ నక్సల్స్ వంటి శక్తులున్నా యని బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. దేశంలో ఎవరు ఎక్కడైనా జీవించవచ్చని అన్నారు. ఈ నినాదాన్ని ఎవరు తీసుకన్నా సరికాదని అన్నారు. లా అండ్ ఆర్డర్ ఫెయిల్యూర్ తోనే గోమార్వాడీ ఉద్యమం పెరిగిపోతుందని ఆరోపించారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా దత్తాత్రేయ పేరును సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారని గుర్తు చేశారు. ప్రస్తుతం హనుమంతరావు లాంటి వారిని కాకుండా సుదర్శన్ రెడ్డిని బరిలోకి దింపడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తు తం ఎన్డీఏ బరిలోకి దింపిన సీపీ రాధా కృష్ణన్ ఒక ఎంబీసీ అని అన్నారు. 03



# ఎవరు సరైన అభ్యర్థో ఎంపీలే నిర్ణయించాలి



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఉప రాష్ట్రపతి ఎన్నికలను ఏకగ్రీవం చేసేందుకు ఎన్డీఏ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇండియా కూటమి తమ అభ్యర్థిగా తెలంగాణకు చెందిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి పేరును ప్రకటించింది. ఈ పరిణామంతో ఉప రాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఈ మేరకు రేపు ఇండియా కూటమి అభ్యర్థిగా బి.సుదర్శన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయబోతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆయన ఇవాళ మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉప రాష్ట్రపతి పదవి రాజ్యాంగబద్ధమైనదని కామెంట్ చేశారు. ఆ పదవికి అర్హుడినని అనుకుంటే తనకు ఓటు వేయాలని ఎంపీలకు పిలుపునిచ్చారు. ఉపరాష్ట్రపతి పదవిని, దేశాన్ని వేరుగా చేసి చూడొద్దని అన్నారు.తాను నిర్మొహమాటంగా ప్రజాక్షేత్రంలోకి వచ్చానని.. ఇందులో ఎలాంటి దాపరికాలు లేవన్నారు. ఉప రాష్ట్రపతి పదవికి ఎవరు సరైన అభ్యర్థో ఎంపీలే నిర్ణయించాలని అన్నారు. ప్రజాప్రతినిధులంతా సరైన నిర్ణయమే తీసుకుంటారని తాను భావిస్తున్నానని తెలిపారు. ఇది రాజకీయ పార్టీల మధ్య జరుగుతోన్న పోరు కానే కాదని అన్నారు. తనకు ఎలాంటి భావజాలం లేదని.. ఏ పార్టీతోనూ సన్నిహిత సంబంధాలు ఉన్న దాఖలాలు లేవని స్పష్టం చేశారు. సమానత్వం, స్వేచ్ఛపై తనకు స్పష్టమైన అవగాహన ఉందని అన్నారు. భారత రాజకీయ వ్యవస్థలో కొంత మార్పు జరగాల్సి అవసరం ఉందన్నారు. రాజ్యసభను నిష్పక్షపాతంగా నడపడం అవసరమని తెలిపారు. తనను ఉప రాష్ట్రపతిగా ఎన్నుకుంటే రాజ్యంగ పరిరక్షణ కృషి చేస్తానని అన్నారు. ఆనాటి ఎన్టీఆర్ ఎపిసోడ్ లో తీర్పునిచ్చిన వాళ్లలో తాను ఒకడినని గుర్తు చేశారు. ఉప రాష్ట్రపతిగా గెలిచే అవకాశాలు తక్కువ ఉన్నాయని తాను అనకోవడం లేదని.. ఎన్డీఏ (NDA) సభ్యులు కూడా తనకు ఓటు వేస్తారని భావిస్తున్నానని సుదర్శన్ రెడ్డి అన్నారు.

# ఫలించిన కాంగ్రెస్ ఎంపీల పోరాటం

- **ఫలించిన తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల యూరియా పోరాటం..**
- **50,000 MT యూరియా సరఫరాకు కేంద్రం ఆమోదం**
- **కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా రవాణా మొదలు.**



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఎట్టకేలకు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీల పోరాటం ఫలించింది. రాష్ట్రానికి అవసరమైన యూరియా సరఫరాపై వారు పార్లమెంట్ ఆవరణలో ఆందోళన చేపట్టడంతో కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ స్పందించింది. ఈ వారంలోనే తెలంగాణకు 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా కర్ణాటక నుంచి 10,800 మెట్రిక్ టన్నుల యూరియా రవాణా ఇప్పటికే ప్రారంభమైంది. అదేవిధంగా ఈ వారంలోనే మరిన్ని మూడు షిప్ మెంట్ ల ద్వారా యూరియా సరఫరా చేయాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కు ఆదేశాలు జారీ అయ్యాయి.రైతుల కష్టాలు దేశానికి తెలియజేసే విధంగా పోరాటం చేసిన ఎంపీలను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. రైతాంగ ప్రయోజనాల కోసం చేసిన ఈ పోరాటం వలననే యూరియా సమస్య పరిష్కారమైందని ఆయన పేర్కొన్నారు. అయితే ప్రతిపక్ష పార్టీలు రాజకీయ స్వార్థం కోసం కుట్రలు చేస్తున్నాయనీ, వాటిపై రైతాంగం ఆలోచించాల్సిన అవసరం ఉందని మంత్రి హెచ్చరించారు. తెలంగాణకు కేటాయించిన యూరియా సరఫరా సకాలంలో జరగకపోవడం కేంద్ర వివక్ష కారణంగానే అని ఆయన స్పష్టం చేశారు. రైతాంగం శ్రేయస్సు కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు.

# 21 ఏండ్లకే ఎమ్మెల్యేగా పోటీకి చాన్స్!

## రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం నివాళులు!



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఆయనను స్మరించుకుంటున్నారు ప్రజలు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సచివాలయం ముందు ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రాజీవ్ గాంధీ దేశ యువతకు స్ఫూర్తి. దేశ సమగ్రతను కాపాడే క్రమంలో ఆయన ప్రాణాలు అర్పించారు. భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీ పడేలా తీర్చిదిద్దిన మహానేత రాజీవ్ గాంధీ" అని పేర్కొన్నారు.అలాగే దేశ యువతకు స్ఫూర్తి రాజీవ్ గాంధీ, దేశ సమగ్రతను కాపాడేందుకు ఆయన ప్రాణాలర్పించారన్నారు. పారదర్శక పరిపాలన అందించడానికి సాంకేతికతను జోడించాలని ఆనాడు రాజీవ్ గాంధీ ఆలోచన చేశారు. 18 ఏండ్లు నిండిన వారికి ఓటు హక్కును కల్పించి దేశ భవిష్యత్ ను నిర్ణయించే అవకాశం కల్పించారు. స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు కల్పించిన దార్శనికుడు రాజీవ్ గాంధీ అని, కంప్యూటర్ ను దేశానికి పరిచయం చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీ అంటూ పేర్కొన్నారు. టెలికాం రంగంతో దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. రాజీవ్ స్ఫూర్తితో ఆనాడు హైదరాబాద్ లో హైటెక్ సిటీకి పునాది పడిందని ఆయన అన్నారు.రాజీవ్ స్ఫూర్తితో తెలంగాణను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళతాం. సంక్షేమం, అభివృద్ధితో పాటు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ లాంటి సామాజిక సమస్యలకు పరిష్కారం చూపామన్నారు. రాజీవ్ గాంధీని దేశ యువత స్ఫూర్తిగా తీసుకోవాలి. రాహుల్ గాంధీని ప్రధానిగా చేసుకుని 21 ఏళ్లు నిండిన వారు శాసన సభకు పోటీ చేసేలా చట్టాన్ని సవరించేందుకు కృషి చేస్తాం. ఆ కలలన్నీ సాకారం కావాలంటే దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలి. రాజీవ్ స్ఫూర్తితో రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే వరకు విశ్రమించబోమన్నారు.ఇక ఢిల్లీలోని వీర్ భూమిలో రాజీవ్ గాంధీ సమాధి వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, "రాజీవ్ గాంధీ తక్కువ కాలం ప్రధానమంత్రి పదవిలో ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థలో, సాంకేతికతలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. భారతదేశం ఆధునిక దిశగా సాగడానికి పునాదులు వేశారు" అని గుర్తుచేశారు. సద్భావన దివస్ సందర్భంగా పలువురు నేతలు రాజీవ్ గాంధీ సేవలను స్మరించి ఆయనకు నివాళులర్పించారు.

# హైదరాబాద్‌ను ఇలానే వదిలేద్దామా..

## మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడం ఎందుకు..?

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పరిపాలనకు ఇబ్బంది లేకుండా నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీలో భాగంగా 30 కోట్లు ఈ భవన నిర్మాణానికి అపర్ణ కన్స్ట్రక్షన్ కేటాయించిందన్నారు. నిజాం నవాబులు 400 ఏళ్ల చరిత్ర ఉన్న నగరంలో నిర్మించారు.. మాదాపూర్, కొండాపూర్, వట్టి నాగులపల్లి వరకు అభివృద్ధి చేసేందుకు వైఎస్ రాజశేఖర్ రెడ్డితో పాటు పలువురు ముఖ్యమంత్రులు కృషి చేశారు.. ప్రపంచంలోని 500కు పైగా కంపెనీలు ఇక్కడే ఉన్నాయి.. ఆనాడు రాజీవ్ గాంధీ కంప్యూటర్ ను దేశానికి పరిచయం చేశారు.. పీవీ నర్సింహారావు స్పెషల్ ఎకనామిక్ జోన్ ను మంజూరు చేశారు.. నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి హైటెక్ సిటీకి శంకుస్థాపన చేశారని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

**మూసీ ప్రక్షాళనతో హైదరాబాద్ అభివృద్ధి..**

మరోవైపు, చిన్న చిన్న వర్షాలకే హైదరాబాద్ నగరం మునిగిపోతుంది అని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన చేస్తామంటే కొందరు వద్దని అంటున్నారు.. ఈ నగరాన్ని ఇలాగే వదిలేద్దామా.. ప్రపంచానికి ఆదర్శంగా హైదరాబాద్ ను నిలుపుకుందామా? వద్దా అని ప్రశ్నించారు. ప్రపంచం ఆశిస్తున్న స్థాయిలో హైదరాబాద్ కు ఇంకా డెవలప్మెంట్ చేయాల్సి ఉంది.. మనం న్యూయార్క్, టోక్యో లాంటి నగరాలతో పోటీ పడాలి.. చిత్తశుద్ధితో సాధిస్తే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. కాబట్టి, వరిజిబాల్ సిటీని గోల్డెన్ సిటీ చేయాలంటే మూసీ ప్రక్షాళన చేసి తీరాలి.. మనకు నదుల ప్రక్షాళన అవసరం.. గంగా, యమున, సబర్మతి నదులను ఆయా రాష్ట్రాలు ప్రక్షాళన చేశాయి.. మనం కూడా మూసీని ప్రక్షాళన చేసుకోవాలన్నారు. పేదల కోసం స్థలాలు వెతకమని మంత్రులకు చెబుతున్నా.. వారికి ఇల్లు కట్టి ఇద్దాం.. సొంత ఇల్లు కళ నెరవేరాలంటే నగరం విస్తరించాలి.. మూసీ విస్తరించాలి.. రాత్రుళ్ళు అక్కడ బిజినెస్ నడవాలి.. నైట్ ఎకానమిని మూసీలో సృష్టించాలని రేవంత్ రెడ్డి సూచించారు.

**సిలికాన్ వ్యాలీని శాసించే స్థాయికి వచ్చాం..**

అయితే, గత ముఖ్యమంత్రుల దూరదృష్టితో హైదరాబాద్ కి అనేక అంతర్జాతీయ కంపెనీలు వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. ఇప్పుడు అమెరికాలోని సిలికాన్ వ్యాలీని శాసిస్తున్నాం.. మన వాళ్ళు ఒక్క రోజు పని చేయకపోతే అమెరికా కుప్పకూలిపోతుంది. కాగా, తెలంగాణ రైజింగ్ 2047 అంటున్నాం.. 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణ ఎదగాలని చెప్పుకొచ్చారు. ఇక, సంవత్సరానికి 15 వేల కోట్ల ఆదాయం ఇచ్చే రిజిస్ట్రేషన్ శాఖ బంగారు గుడ్డు పెట్టె బాతు.. లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టి రాష్ట్రానికి ఆదాయం తెచ్చి పెడుతున్న వారిని దొంగలుగా చూస్తున్నారు.. నేరం చేసే వాళ్ళ మాదిరిగా రిజిస్ట్రేషన్ కు వచ్చే వాళ్ళను చూసే పరిస్థితి మారాలని సీఎం సూచించారు.

**8 నెలల్లో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల నిర్మాణం**

కాగా, అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉంటాయని రేవంత్ రెడ్డి సూచించారు. ఈ ప్రభుత్వం మీది.. మీకు వసతులు కల్పించడం వల్ల మంచి పేరు వస్తుంది.. 144 సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సంవత్సరానికి 19 లక్షల డాక్యుమెంట్లు చేస్తున్నాం.. విదేశాల్లో సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు మంచి పేరు ఉంది.. అన్ని ప్రభుత్వ శాఖలను ప్రక్షాళన చేయాలి.. 2034లో ప్రపంచం హైదరాబాద్ ను ఫ్యూచర్ సిటీగా చూడడానికి రావాలి.. అన్ని విభాగాలు అక్కడి నుంచే పని చేయాలని వెల్లడించారు. ఇక, జూన్ 2వ తేదీ లోపు 11 ఇంటిగ్రేటెడ్ కార్యాలయాలు పూర్తి చేయాలి.. కేవలం 8 నెలల్లోనే అపర్ణ కన్స్ట్రక్షన్ వారు ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసు నిర్మాణం పూర్తి చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు.

# ఆపరేషన్ వైర్..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్‌లో ఇటీవల రామాంతాపూర్, బండ్లగూడ, తదితర ప్రాంతాల్లో విద్యుత్ షాక్‌ల కారణంగా ప్రజలు మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు విద్యుత్ స్తంభాలపై అనుమతి లేని ఇంటర్నెట్, ఇతర కేబుల్స్‌ను భారీగా అధికారులు తొలగించారు. ఈ చర్యలతో ప్రజలు, ఇంటర్నెట్ ప్రొవైడర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో నగరంలో విద్యుత్ శాఖ వర్సెస్ కేబుల్ ఆపరేటర్లుగా మారింది. వైర్ల తొలగింపు ఆపకపోతే ఆందోళనకు దిగుతామని కేబుల్ ఆపరేటర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం మరోసారి టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీతో కేబుల్ ఆపరేటర్ల జేఏసీ నేతలు చర్చలు జరిపారు. అనంతరం ఈ సమావేశంపై టీజీ ఇంటర్నెట్ ప్రొవైడర్ ప్రెసిడెంట్ సతీష్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. టీజీ ఎస్పీడీసీఎల్ సీఎండీతో కేబుల్ ఆపరేటర్లు చర్చలు సఫలం అయినట్లు క్లారిటీ ఇచ్చారు. కేబుల్, ఇంటర్నెట్ వైర్లను కట్ చేయొద్దనే డిమాండ్‌కు ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని వెల్లడించారు. రన్నింగ్‌లో ఉన్న కేబుల్, ఇంటర్నెట్ వైర్లను ఒకే బంచింగ్ విధానంలో తీసుకురావాలని చెప్పినట్లు వెల్లడించారు. నగర సుందరీకరణకు మేము కూడా అంగీకరిస్తామని టీజీ ఇంటర్నెట్ ప్రొవైడర్ ప్రెసిడెంట్ సతీష్‌బాబు తెలిపారు.

# మేడారం జతరకు రూ.150 కోట్లు మంజూరు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు ఆసియాలోనే అతిపెద్ద మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు రూ.150 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ పాలనాపరమైన అనుమతులిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. వచ్చే ఏడాది జనవరి 28 నుంచి సమ్మక్క సారలమ్మ జాతర ప్రారంభమై 31న ముగియనుంది. ఈ మేరకు తాజాగా మంజూరైన నిధులతో భక్తులు, వీఐపీల కోసం రూ.5 కోట్లతో గెస్ట్ హౌస్ నిర్మాణం చేపట్టనున్నారు. ఇప్పటికే నాలుగునూట్ల గెస్ట్ హౌస్ నిర్మాణానికి ఆర్ అండ్ బీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ అనుమతులు ఇచ్చారు. కాకతీయ రాజుల కాలం నుంచి కొనసాగుతూ వస్తున్న ఈ జాతరకు కోటి మందికి పైగా భక్తులు హాజరవుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా ప్రసిద్ధి చెందిన మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే కోట్లాది మంది భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దశగా రేవంత్ సర్కార్ ప్రణాళికలు రూపొందిస్తోంది.

# బైకర్ ఢీ కొట్టడంతో ఎగిరిపడ్డ కానిస్టేబుల్



**చౌటుప్పల్ ,ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ గేట్ వద్ద ప్రమాదం చోటు చేసుకుంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ చేపడుతున్న సమయంలో ఓ బైక్ రైడర్ వేగంగా వచ్చి కానిస్టేబుల్ ఆసిఫ్ ను ఢీ కొట్టాడు. యువకుడు తప్పించుకునేందుకు బైక్ ఆపకుండా వేగంగా రావడంతో కానిస్టేబుల్ అడ్డుకునే ప్రయత్నంగా చేయగా ఢీ కొట్టడంతో ఎగిరిపడ్డాడు. ఈ ఘటనలో కానిస్టేబుల్ కు తీవ్రగాయాలు అయ్యాయి.డ్యూటీలో ఉన్న పోలీసులు వెంటనే అతడిని యశోద ఆస్పత్రికి తరలించారు. ఆసిఫ్ కు మూడు చోట్ల బలమైన గాయాలు తగిలినట్టు సమాచారం. మరోవైపు ఢీ కొట్టిన వ్యక్తిని విశాల్ గా గుర్తించారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో నెటిజన్లు బైక్ రైడర్ ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే చలాన్ తో పోయేదని, ఇప్పుడు డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ప్రాణాల మీదకు తెచ్చిందని మండిపడుతున్నారు.


# మహిళా పోలీస్‌లకు యూనిఫార్మ్ ఉండాలి

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కమిట్మెంట్, కాన్ఫిడెన్స్ కు చిరునామా మహిళా పోలీసులు అని మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుధవారం రాజేంద్రనగర్ లోని తెలంగాణ పోలీస్ అకాడమీలో తెలంగాణ మహిళా పోలీస్ తొలి సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై ప్రసంగించారు. మహిళా పోలీసుల సంక్షమం పట్ల ఒక కమిట్మెంట్ గా ఈ సదస్సు నిలుస్తోందన్నారు. మహిళా శక్తినీ ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హోమ్ మినిస్టర్ గా ఉన్నారని కొనియాడారు. ఈ సదస్సులో మీరు ఇచ్చే సలహాలు సూచనలకు అనుగుణంగా మీ సంక్షేమం కోసం సీఎం సానుకూల నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. ఈ దేశంలో మహిళా పోలీసింగ్ కు ఇందిరా గాంధీ పునాదులు వేశారని, 1973లో కేరళ రాష్ట్రం కోజికోడ్ లో తొలి మహిళా పోలీస్ స్టేషన్ను ఇందిరా గాంధీ ప్రారంభించారని గుర్తుకుచేశారు. ఆ తర్వాత దేశవ్యాప్తంగా మహిళా పోలీస్ స్టేషన్ లు ఏర్పాటు అయ్యాయని వివరించారు.వృత్తి ధర్మం, మాతృత్వం మధ్య మహిళా పోలీసులు సంఘర్షణలు ఎదుర్కొంటారని తెలిపారు. కాబట్టి మెటర్నిటీలో ఉన్న మహిళా పోలీసులకు కొన్ని మినహాయింపులు ఇవ్వాలని అన్నారు. మహిళలకు కొన్ని ప్రత్యేక అవసరాలు ఉంటాయి కాబట్టి.. వాటి దృష్టిలో పోలీస్ శాఖ మహిళలా పోలీసులకు అండగా ఉండాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లోకి వచ్చే బాధితులకు భరోసాగా మహిళా పోలీసులు నిలవాలని సూచించారు. ప్రతి ఏడాది పోలీసులందరికీ జెండర్ సెన్సిటైజేషన్ ట్రైనింగ్ నిర్వహించాలని సూచించారు. మహిళా పోలీసులకు వీక్లీ ఆఫ్, ప్రత్యేక పని వేళల సౌకర్యాలు కల్పించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. మహిళా పోలీసుల ప్రత్యేక అవసరాలపై అధ్యయనం చేసి నివేదిక ఇస్తే చట్టాలు చేస్తామని హామీ ఇచ్చారు. సైబర్ క్రైమ్, ఆన్ లైన్ హరాస్మెంట్ వంటి కేసులలో మహిళా పోలీసులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని సూచించారు. స్ట్రెస్ మేనేజ్ మెంట్, కౌన్సెలింగ్ ప్రోగ్రాములు మహిళా పోలీసుల కోసం తప్పనిసరిగా ఉండాలన్నారు. మెటర్నిటీ, పోస్ట్-డెలివరి కాలానికి అనువుగా తమిళనాడు తరహాలో ప్రత్యేక యూనిఫార్మ్ లు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల్లో మహిళా పోలీసుల కోసం ఉన్న బెస్ట్ ప్రాక్టీసెస్ ను స్టడీ చేసి నివేదిక ఇస్తే వాటిని అమలు పరుస్తామన్నారు.మహిళా పోలీసులకు అవసరమైన రెస్ట్ రూములు, వెల్నెస్ సెంటర్లను నెలకొల్పాలన్నారు. రాష్ట్రంలో 80 వేల మంది పోలీసులు ఉంటే.. అందులో మహిళా పోలీసులు కేవలం 7 వేల మంది మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా పోలీసుల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మహిళా పోలీస్ ఎదుర్కొంటున్న సమస్యలు సవాళ్లను అధిగమించేలా ఈ సదస్సు ఉపయోగపడుతుందన్న నమ్మకం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జనరల్ పోలీస్ అధికారులు అభిలాష బిస్త్, చారు సిన్హా, శిఖా గోయల్, స్వాతి లక్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. కాగా, కానిస్టేబుల్ నుంచి ఎస్పీ వరకు 400 మంది మహిళా పోలీస్ అధికారులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

# సమస్యకు పరిష్కారం చూపాలి

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** సినీ కార్మికుల సమ్మె 17వ రోజుకి చేరుకున్న సంగతి విధితమే. అయినా కానీ కార్మికుల సమస్యలపై ఎంటువంటి నిర్ణయం ఇంకా ఫైనల్ కాలేదు. ఈ పరిస్థితులలో హైదరాబాద్ లో జరుగుతున్న సినీ కార్మికుల సమ్మెపై తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకుంది. ఫిలిం ఛాంబర్, ఫెడరేషన్ నాయకులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఆదేశించారు. గత 17 రోజులుగా జరుగుతున్న ఈ సమ్మె ప్రభావం రాష్ట్ర సినిమా పాలసీపై పడుతుందనే అభిప్రాయాన్ని ప్రభుత్వం వ్యక్తం చేసింది. హైదరాబాద్ ను సినిమా హబ్ గా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆలోచనకు సినీ కార్మికుల సమ్మె పెద్ద అడ్డంకిగా మారిందని అధికారులు భావిస్తున్నారు.తెలుగు సినిమాలతో పాటు ఇతర భాషల సినిమా షూటింగ్ లు నిలిచిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇప్పటికే ఫిలిం ఛాంబర్ ప్రతినిధులతో ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. ఇక ఈరోజు ఫెడరేషన్ నాయకులతో కూడా చర్చలు జరపనున్నారు. ఇక కాసేపట్లో ఫెడరేషన్ నాయకులతో డీజీపీ సమావేశం కానున్నట్టు సమాచారం. మరోవైపు ఈరోజు సాయంత్రం మూడు గంటలకు నిర్మాతలతో, నాలుగు గంటలకు ఫెడరేషన్ నాయకులతో ఫిలిం ఛాంబర్ కీలక చర్చలు నిర్వహించనుంది. చూడాలి మరి ఈరోజు అయినా వారి సమస్యకు ఎండ్ కార్డు పడుతుందో లేదో..

# బెట్టింగ్ యాప్స్ పై కేంద్రం నిర్ణయం..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఆన్ లైన్ బెట్టింగ్ యాప్స్ పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిషేధ నిర్ణయాన్ని ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ హర్షించారు. ఇప్పటికే ఈ యాప్స్ కారణంగా దేశవ్యాప్తంగా ఎంతోమంది అమాయకులు మోసపోయారని, ఆర్థికంగా కూలిపోయారని గుర్తుచేశారు. ఈ తరహా వ్యసనపరచే యాప్స్ వల్ల కుటుంబాలు నాశనం కావడంతోపాటు సమాజంలో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన పేర్కొన్నారు. సజ్జనార్ మాట్లాడుతూ.. బెట్టింగ్ యాప్స్ పై నిషేధం విధించడం సమాజ రక్షణ దిశగా తీసుకున్న ముఖ్యమైన అడుగు అని అయన అభిర్ణించారు. అయితే కేవలం కొన్ని యాప్స్ నే కాకుండా, ఇలాంటి దారుణ ప్రభావం చూపే మరికొన్ని యాప్స్ పైనా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి అని ఆయన అన్నారు. అలాగే, ఈ యాప్స్ ఏ రూపంలోనూ దేశంలోకి రాకుండా చూడటం కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత అని ఆయన అన్నారు.కిందిస్థాయి పోలీస్ అధికారులపై ఈ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేసే బాధ్యత ఉందని, వారికి తగిన అధికారం ఇవ్వాలని సజ్జనార్ సూచించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో ఇప్పటికే ఈ యాప్స్ పై నిషేధం ఉన్నప్పటికీ, అవి దొడ్డి దారుల ద్వారా మళ్లీ ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ మార్గాలను అన్వేషిస్తూ నిర్వాహకులు మరోసారి మార్కెట్ లోకి ప్రవేశించే ప్రయత్నం చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. "ఈసారి మాత్రం కఠిన చర్యలు తీసుకుని, యాప్స్ నిర్వాహకులకు ఎటువంటి అవకాశం ఇవ్వకూడదు. సమాజ రక్షణ కోసం కఠిన చట్టాలు, కఠిన అమలు తప్పనిసరి" అని సజ్జనార్ స్పష్టం చేశారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

## రైతులకు మద్దతుగా రోడ్డెక్కిన మాజీ ఎమ్మెల్యే



**ఖానాపురం,ఫ్లాష్ ఇండియా :** ఖానాపురం మండలంలోని బుధరావుపేట గ్రామంలో రైతన్నల కోసం నర్సంపేట మాజీ శాసన సభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి రోడ్డెక్కారు. ఉదయం 3 గంటల నుండి లైన్ లో నిలబడిన రైతులకు యూరియా దొరకపోవడంతో ఆగ్రహం చెందిన రైతన్నలు 365 జాతీయ రహదారిపై ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి రోడ్డుపై బైఠాయించారు. నర్సంపేట డివిజన్ వ్యాప్తంగా కొరత తీవ్రంగా ఉందన్నారు. సరి దిద్దాల్సిన అధికారులు ప్రజాప్రతినిధులు తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా పంటల సాగుకు అవసరమైన యూరియా దొరక్కపోవడంతో రైతన్నల ఆందోళన చెందుతున్నారు. పొద్దున నుంచి నిలబడిన రైతులకు యూరియా అందకపోవడంతో లైన్ లో నిల్చిన రైతుకు మూర్చ వచ్చి సోమ్మ సిల్లిపడిపోయాడు. రైతన్నల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

## ఇది సరైన పద్ధతి కాదు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఇటీవల సోషల్‌మీడియాలో బాగా వైరల్ అవుతున్న మార్వాడీ గో బ్యాక్ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ నేత వి. హన్మంతరావు స్పందించారు. మార్వాడీలకు ఆయన మద్దతు పలికారు. మంగళవారం గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వీహెచ్‌మాట్లాడుతూ.. నిజాం కాలం నుంచి మార్వాడీలు ఇక్కడ వ్యాపారాలు చేస్తున్నారని, తరతరాలుగా మార్వాడీలు తెలంగాణలో ఉంటున్నారని చెప్పారు. కానీ మార్వాడీలను గో బ్యాక్ అనడం ఏంటి, ఇది సరైన పద్ధతి కాదని ఆయన మండిపడ్డారు. రిలయన్స్, డీ మార్ట్ లాంటి బడా కంపెనీలలో అన్ని వస్తువులు దొరుకుతున్నాయని, మరి వాళ్ళను ఎందుకు గో బ్యాక్ అనడం లేదని వీహెచ్ ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి జరుగుతోందని, దీంతో ఇతర రాష్ట్రాల నుంచి చాలా మంది వస్తున్నారన్నారు. ఈ విధమైన నినాదాలతో అభివృద్ధి కుంటు పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తే తప్పకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వీహెచ్ డిమాండ్ చేశారు.

## కేంద్రం ప్రోత్సాహకం అందించాలి



**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ ( కేటీపీఎస్ ) ఆధునికీకరణ, పాత ప్లాంట్ల పునరుద్ధరణకు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ చొరవ చూపాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి లోక్ సభలో కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా బుధవారం.. 377 నిబంధన కింద ఈ అంశాన్ని ప్రస్తావించారు.

**దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతమైంది..**

తెలంగాణ రాష్ట్రంలో 820 మెగావాట్ల విద్యుత్తును అందిస్తున్న.. ఈ కేటీపీఎస్ ప్లాంట్ దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతమైందని ఎంపీ రఘురాం రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ కు అనుగుణంగా.. రెండు 800 మెగావాట్ల యూనిట్లుగా ఆధునికీకరణ చేపట్టాలని అన్నారు. 500 ఎకరాల్లో విస్తరించి ఉన్న కేటీపీఎస్ కు పుష్కలమైన బొగ్గు నిల్వలు, నీటి సరఫరాకు కిన్నెరసాని రిజర్వాయర్, రైల్వే లైన్ల అనుసంధానం, సబ్ స్టేషన్లు మరియు విద్యుత్ సరఫరా లైన్లు ఉన్నట్లు వివరించారు. పాత థర్మల్ స్టేషన్లకు ఆర్అండ్ఎం వంటి కేంద్ర ప్రాయోజిత పథకాల కింద.. రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో సాంకేతిక సహకారం, ఆర్థిక తోడ్పాటు అందించాల్సిందిగా కోరారు.

### కేన్స్ సెమీకండక్టర్ పరిశ్రమపై

## కేటీఆర్ అబద్ధాల ప్రచారం

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కేయెన్స్ సెమీ కండక్టర్ పరిశ్రమ గురించి కేటీఆర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కేయెన్స్ సెమీ కండక్టర్ పరిశ్రమ హైదరాబాద్ నుంచి గుజరాత్ తరలిపోవడానికి ప్రభుత్వ వైఫల్యమే కారణమని బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపించడం బట్టకాల్చి మీద వేయడం లాంటిదేనని, నిరాధార, అసత్య ప్రచారాలు చేయడం ఆయనకు అలవాటేనని స్పష్టం చేశారు. కేయెన్స్ ఇక్కడి నుంచి వెళ్లిపోయింది అనడం కంటే కేంద్రం, గుజరాత్లోని బీజేపీ ప్రభుత్వాలు భారీ సబ్సిడీలు కుమ్మరించి లాక్కు పోయాయని చెప్పడం సబబుగా ఉంటుందన్నారు. ఇది కేటీఆర్ కు తెలుసని, తెలంగాణా ప్రజలను మభ్యపెట్టడానికి ఇలాంటి ఆరోపణలు చేస్తుంటారని దుయ్యబట్టారు. ప్రజలను గాలికొదిలి హైదరాబాద్ లో కూర్చుని రోజూ ఏదో ఒక అంశంపై గోబెల్స్ ప్రచారం చేయడం గులాబి పార్టీ నాయకులకు అలవాటేనని అన్నారు.ప్రజలు తాము ఏది చెప్పినా నమ్ముతారని, ఇంకా అనుకోవడం వారి భ్రమ అని, గుజరాత్ లోని సనంద్ లో కేయెన్స్ సెమీకాన్ ఏర్పాటు చేస్తున్న పరిశ్రమకు ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ISM) కింద ప్రాజెక్ట్ వ్యయంలో 50 శాతం సబ్సిడీ అందించడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని వివరించారు. రూ.76,000 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఇండియా సెమీ కండక్టర్ మిషన్ ను నెలకొల్పిన విషయం తెలిసిందే. గుజరాత్ లో ఏర్పాటు చేస్తే 50శాతం సబ్సిడీ వస్తుందనే ప్రచారం మొదలు పెట్టడంతో సహజంగానే సెమీకండక్టర్ పరిశ్రమలు ఆ రాష్ట్రం వైపు చూస్తాయని తెలిపారు. కేయెన్స్ ప్రతిపాదిత ప్రాజెక్టు వ్యయం రూ.3,307 కోట్లు అయితే ఇందులో సెంట్రల్ గవర్నమెంట్ సబ్సిడీ కింద రూ.1653.5 కోట్లు ఉదారంగా లభిస్తాయి.ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాల కింద కేంద్రం ఇచ్చే సబ్సిడీలో 40 శాతం అంటే మరో రూ.661 కోట్లు అందజేస్తుందని వివరించారు. ప్రాజెక్టు వ్యయంపై మొత్తం సబ్సిడీ 70 శాతం. రూ.2,314.9 కోట్లతో సమానమని, కేంద్ర ప్రభుత్వం ఇండియా సెమీకండక్టర్ మిషన్ కింద 50 శాతం సబ్సిడీ ఇవ్వాల్సి ఉన్నా, ఇతర రాష్ట్రాల విషయంలో అంత ఉదారత చూపించడంలేదన్నారు. గుజరాత్ అయితే కేంద్ర సబ్సిడీ విషయం ఆ రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందనే ప్రచారాన్ని సెమీకండక్టర్ పరిశ్రమలు సహజంగానే విశ్వసిస్తాయి. ఈ సవతి తల్లి ప్రేమ గురించి బీజేపీని విమర్శించే ధైర్యం లేకనే బీఆరెస్ రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. గుజరాత్ లో నెలకొల్పే సెమీకండక్టర్ పరిశ్రమలకు ఇస్తున్న రాయితీలు చూస్తే ఒక్క ఉద్యోగానికి రూ.3.2 కోట్ల సబ్సిడీలు లభిస్తున్నాయని సాక్షాత్తు కేంద్ర మంత్రి హెచ్ డి కుమారస్వామి పేర్కొన్న విషయం తెలిసిందేనని చెప్పుకొచ్చారు.

## ప్రభుత్వ చేతగానితనం వల్లే

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరో కాంగ్రెస్ సర్కార్ పై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. గత రెండు నెలలు గా యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల రైతులు దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని ఆయన తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ హయాంలో ఆరు నెలల ముందే ఎరువుల బస్తాలు సిద్ధంగా ఉంచేవారని, ఇప్పుడు ఒక ప్రణాళిక కూడా చేయట్లేదని ఆయన అన్నారు. అంతేకాకుండా.. కాంగ్రెస్ పార్టీ దున్నపోతు మీద వాన కురిసిన విధంగా వ్యవహరిస్తోందని ఆయన ధ్వజమెత్తారు. ఢిల్లీకి రాహుల్ గాంధీని కలవడానికి వెళ్లి రేవంత్ రెడ్డి ఏదో ఒక పేపర్ ఇచ్చి వస్తున్నారని, ఇక్కడ పోలీసులను పెట్టి ఎరువుల బస్తాలు అమ్మే పరిస్థితి వచ్చిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏ ఊరికి పోయినా చేంతాడు అంత లైన్ కనిపిస్తుందని, ఇంత జరుగుతున్నా రాష్ట్రంలో ఎరువుల కొరత లేదు అని ప్రభుత్వం మాట్లాడుతోందని ఆయన అన్నారు. 24 గంటలు బురద రాజకీయాలు చేస్తున్నారని, మాకు మరో అనుమానం ఉందని, బ్లాక్ మార్కెట్ లో కాంగ్రెస్ నేతలు అమ్ముతున్నారు అని అనుమానం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఏమో కొరత లేదు అంటున్నాడని, ఢిల్లీలో వాళ్ళ ఎంపీ లు ఏమో యూరియా కోసం ధర్నా లు చేస్తున్నారని, పదేళ్ల లో రాని సమస్య ఇప్పుడు ఎందుకు వచ్చిందని కేటీఆర్ ప్రశ్నించారు.

## ఎన్డీఏ అభ్యర్థిగా రాధాకృష్ణన్ నామినేషన్

**ఢిల్లీ :** ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీఏ కూటమి తరపున సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేశారు. నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీ, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, అమిత్ షా, గడ్కరీ హాజరయ్యారు.నామినేషన్ కు ముందు రాధాకృష్ణన్ పార్లమెంట్ ఆవరణలో ప్రముఖ వ్యక్తుల విగ్రహాలను సందర్శించి నివాళుల ర్పించారు. ముందుగా మహాత్మాగాంధీ భారీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం ఇతర విగ్రహాలకు నమస్కరించారు.రాధా కృష్ణన్ తమిళనాడు ప్రాంత వాసి. కోయంబత్తూరు నుంచి రెండు సార్లు లోక్ సభ ఎంపీగా గెలిచారు. పుదుచ్చేరిలో లెఫ్టినెంట్ గవర్నర్ గా.. జార్ఖండ్, తెలంగాణలో గవర్నర్ గా పని చేశారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్ గా ఉన్నారు. అలాగే తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా కూడా పని చేశారు. అనూహ్యంగా రాధాకృష్ణన్ ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్డీఏ కూటమి ఎంపిక చేసింది. ఎన్నికల్లో విజయం సాధిస్తే.. పూర్తి కాలంగా ఉపరాష్ట్రపతిగా కొనసాగుతారు.ఇక మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాధాకృష్ణన్ ను మోడీ, కేంద్రమంత్రులు సత్కరించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ సేవలను మోడీ ప్రశంసించారు. ఇక రాధాకృష్ణన్ గెలిచేందుకు లోక్ సభలో.. రాజ్యసభలో సంపూర్ణ మెజార్టీ ఉంది.ఇక ఇండియా కూటమి అభ్యర్థిగా తెలంగాణ వ్యక్తి, సుప్రీకోర్టు మాజీ న్యాయమూర్తి సుదర్శన్ రెడ్డి పేరును కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రకటించారు. గురువారం సుదర్శన్ రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. జగదీప్ ధన్ ఖర్ అనూహ్యంగా జూలై 21న ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో రాజీనామా చేసినట్లు ప్రకటించారు. దీంతో ఉపరాష్ట్రపతి ఎన్నికలు అనివార్యమయ్యాయి.

## దేశంలో లేని సమయం చూసే..?

### ఎమ్మెల్సీ కవితకి మరోసారి షాక్ ఇచ్చిన కేటీఆర్!

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత, కేటీఆర్ మధ్య గ్యాప్ పెరుగుతున్నట్లు పొలిటికల్ సర్కిల్ లో టాక్ నడుస్తోంది. అన్నాచెల్లెలి మధ్య దూరం రావడానికి గల కారణాలు ఏంటనేది ఇంత వరకు తెలియరాలేదు. కానీ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్.. కవితకు మరోసారి షాక్ ఇచ్చారు. తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న ఎమ్మెల్సీ కవిత ప్లేసులో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను నియమించారు. అయితే.. ఈ సంఘం కార్యవర్గ సమావేశంలో కొప్పుల ఈశ్వర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యకలాపాలను పార్టీ తరపున ముందుకు తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**మీడియా ముందుకు కవిత వర్గం నాయకులు!**

కవిత దేశంలో లేని సమయం చూసి బొగ్గుగని సంఘం నుంచి ఆమెను కేటీఆర్ పూర్తిగా తొలగించినట్లు ఆమె వర్గం నేతలు గుర్రుగా ఉన్నారు. ట్రేడ్ యూనియన్ నిబంధనల ఉల్లంఘన చేశారని కవిత వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు. జనరల్ బాడీ మీటింగ్ లేకుండానే కొప్పుల ఈశ్వర్ ను పూర్తి స్థాయి అధ్యక్షుడిగా అలా ఎలా నియమిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఈ అంశంపై కవిత వర్గం నాయకులు ప్రెస్ మీట్ పెట్టే అవకాశం ఉనట్లు తెలుస్తోంది. కవిత స్థానంలో కొప్పులను నియమించడంపై పార్టీ వర్గాల్లో గందరగోళం నెలకొన్నట్లు పొలిటికల్ సర్కిల్ లో హాట్ టాపిక్ గా మారింది.

## యూరియా కొరత లేదు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** మార్వాడీ గోబ్యాక్ నినాదం వెనుక అర్బన్ నక్సల్స్ వంటి శక్తులున్నా యని బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు. దేశంలో ఎవరు ఎక్కడైనా జీవించవచ్చని అన్నారు. ఈ నినాదాన్ని ఎవరు తీసుకన్నా సరికాదని అన్నారు. లా అండ్ ఆర్డర్ ఫెయిల్యూర్ తోనే గోమార్వాడీ ఉద్యమం పెరిగిపోతుందని ఆరోపించారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా దత్తాత్రేయ పేరును సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదించారని గుర్తు చేశారు. ప్రస్తుతం హనుమంతరావు లాంటి వారిని కాకుండా సుదర్శన్ రెడ్డిని బరిలోకి దింపడం ఏమిటని ప్రశ్నించారు. ప్రస్తు తం ఎన్డీఏ బరిలోకి దింపిన సీపీ రాధా కృష్ణన్ ఒక ఎంబీసీ అని అన్నారు. బీసీ ల గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలంతా ఆత్మప్రబోధన చేసుకొని ఎన్డీయే అభ్యర్థికిఓటు వేయాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు. రాధాకృష్ణన్ గెలుపుతోనే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు.గతంలో ఉపరాష్ట్రపతిగా పోటీ చేసిన వెంకయ్యనాయుడు కూడా తెలుగు వారేనని,అప్పుడెందుకు పోటీ పెట్టారని ప్రశ్నించారు. యూరియా ఇవ్వడం లేదని కేంద్రంపై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో అదనంగా నిలువ ఉన్న 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను ఎక్కడ దాచుకున్నారో తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అంటేనే మదర్ ఆఫ్ ఆల్ లైస్ అని అన్నారు. కేంద్రం ఎక్కడ కూడా యూరియా షార్టేజ్ చేయలేదని చెప్పుకొచ్చారు. పొద్దునే లేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది తప్పులు, అప్పులేనని అన్నారు. ముఖ్యమైన మంత్రుల కారణంగానే రాష్ట్రంలో యూరియా కొరత్త ఏర్పడిందని చెప్పారు. యూరియా పంపిణీ అంశంపై తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. రబీ సీజన్ లో రాష్ట్రానికి 9.7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రిక్వైర్ మెంట్ ఉండగా 12.47 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం రాష్ట్రానికి ఇచ్చింద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద 7 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ఉందని చెప్పారు. కేంద్రం నుంచి యూరియా రావడానికి సెప్టె బర్ వరకు సమయం ఉందని అన్నారు. ఒక భయాన్ని మార్కెట్ లో సృష్టించి రైతులను అగం చేస్తున్నారని అన్నారు.

## ఏ పార్టీ కూడా మాకు బాస్‌లు కారు..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఉపరాష్ట్రపతి ఎన్నికలో బీఆర్ఎస్ మద్దతుపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం హైదరాబాద్ లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయంలో రెండు కూటమి పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయని వెల్లడించారు. కానీ బీఆర్ఎస్ పార్టీ సర్వ స్వతంత్ర్యమైన పార్టీ అని స్పష్టం చేశారు. మాకు ఢిల్లీలో బాస్ లు లేరు.. ఏ పార్టీ కూడా మాకు బాస్ లు కారు.. మాకు తెలంగాణ ప్రజలే బాస్ లు తప్ప.. మాకు ఢిల్లీలో పెద్దలు, ఆదేశించేవారు ఎవరూ లేరు.. అని కేటీఆర్ తెలిపారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో మాకు ఏ పార్టీ, అభ్యర్థులు కానీ మమ్మల్ని సంప్రదించలేదని క్లారిటీ ఇచ్చారు. ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగుతోందని, కేవలం మీడియాలో చూసేదాకా తెలియదన్నారు. ఎన్నికపై మమ్మల్ని ఎవరూ కూడా సంప్రదించలేదు.. ఎన్నికకు ఇంకా టైమ్ ఉంది కాబట్టి.. బీఆర్ఎస్ నేతలు కలిసి ఆలోచించుకోని ఎలక్షన్ సమయానికి మా వైఖరి ప్రకటిస్తామని స్పష్టం చేశారు.మేము ఎన్ డీఏ కూటమీలో లేము.. ఇండియా కూటమిలో లేము.. అని కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరికి సపోర్ట్ చేయాలనే దానిపై కూడా మాకు ఢిల్లీ నుంచి ఎలాంటి ఒత్తిడి లేదన్నారు. నరేంద్ర మోడీ, రాహుల్ గాంధీ మా బాస్ లు కాదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఇక్కడి ప్రజల ప్రయోజనాలకు అనుగుణంగా మద్దతుపై నిర్ణయం తీసుకుంటామని, ప్రస్తుతానికి ఏ నిర్ణయం తీసుకోలేదని క్లారిటీ ఇచ్చారు. అలాగే రేవంత్ రెడ్డి పెట్టిన అభ్యర్థి అయితే కచ్చితంగా వ్యతిరేకిస్తామని విమర్శించారు. కాంగ్రెస్ అనేది ఒక చిల్లర పార్టీ అని.. అలాంటి ముఖ్యమంత్రి పెట్టిన అభ్యర్థిని మేము సమర్ధిస్తామని ఎలా అనుకుంటారని తీవ్ర విమర్శలు గుప్పించారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల విషయంలో డ్రామా జరుగుతోందన్నారు.బీసీల విషయంలో మా పార్టీ చిత్తశుద్ధి ఉందని చెప్పి.. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బీసీని ఎందుకు పెట్టలేదు అని ప్రశ్నించారు. బీసీలపై ప్రేమ ఉంటే తెలంగాణ నుంచి ఒక్క బీసీ అభ్యర్థి దొరకలేదా? అని నిలదీశారు. సామాజిక వేత్త కంచె ఐలయ్యను అభ్యర్థిగా పెట్టి మీ చిత్తశుద్ధి నిరుపించుకోవాల్సిందని సూచించారు. బీసీ అభ్యర్థులను పెట్టరు.. కానీ మీ మాటలు మేము నమ్మాలా? అని ప్రశ్నించారు. రెండు పార్టీలు దొందూ.. దొందే.. వారు తెలంగాణకు ఏమి చేయలేదన్నారు. కాబట్టి సెప్టెంబర్ 9 లోపు రెండు లక్షల టన్నుల ఎరువులు ఎవరు తీసుకొచ్చి పెడితే ఆ పార్టీ ఉప రాష్ట్రపతి అభ్యర్థికే బీఆర్ఎస్ సానుకూలంగా ఉంటుందని కేటీఆర్ తేల్చి చెప్పారు.

## రేవంత్ రెడ్డి ఓ చేతకాని ముఖ్యమంత్రి

**నంగునూరు,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. సిద్దిపేట జిల్లా నంగునూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన ఆయన రైతుల సమస్యలపై ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఎండగట్టారు. రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీష్ రావు విమర్శించారు. "రైతులకు కంటి నిండా నిద్ర పట్టడం లేదు.. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం కుంభకర్ణుడిలా నిద్రిస్తున్నారు" అని ఆయన మండిపడ్డారు.రైతులకు కావలసిన యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. "51 సార్లు ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఒక్క యూరియా బస్తా కూడా తెచ్చే దమ్ములేదు. రైతులకు న్యాయం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని హరీష్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ పాలనలో రైతుల పాదాలను గోదావరి జలాలతో కడిగారని గుర్తుచేస్తూ.. "ఇప్పుడు రైతులను పోలీసుల కాళ్లు మొక్కించే పరిస్థితి తెచ్చింది రేవంత్ ప్రభుత్వం" అని ఆయన తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు.కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు ఢిల్లీలో ఉన్నా రైతుల కోసం ఏమాత్రం కృషి చేయలేదని, రైతుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమయ్యారని హరీష్ ఆరోపించారు. "ఏ ఎన్నికలు పెట్టినా రైతులే కాంగ్రెస్ కు గుణపాఠం చెపుతారు" అని ఆయన హెచ్చరించారు. తక్షణమే రైతులకు యూరియా అందించకపోతే బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని హరీష్ స్పష్టం చేశారు.

### లోక్‌సభ ముందుకు

## 3 కీలక బిల్లులు..



**ఢిల్లీ :** బుధవారం(ఆగస్టు20) లోక్ సభలో మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టింది ఎన్డీయే ప్రభుత్వం. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు సహా ఎన్నికైన ప్రతినిధులను నేరారోపణలకు సంబంధించి అరెస్టు చేసినా లేదా వరుసగా 30 రోజులు నిర్బంధించినా వారి పదవుల నుంచి తొలగించే ప్రతిపాదనతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్ సభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. అయితే ఇది సభలో తీవ్ర గందరగోళానికి దారితీసింది..కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ప్రభుత్వం రాష్ట్రాల్లోని బిజెపియేతర ప్రభుత్వాలను అస్థిరపరచాలని లక్ష్యంగా పెట్టుకుందని ప్రతిపక్షాలు ఆరోపించాయి.

**అమిత్ షా ప్రవేశపెట్టిన ఈ బిల్లులు:**

రాజ్యాంగ (నూట ముప్పైవ సవరణ) బిల్లు, 2025

కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు, 2025

జమ్మూ కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2025

**సభలో గందరగోళం..**

ఈ బిల్లులు సభలో తీవ్ర గందరగోళానికి దారితీశాయి. ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకించాయి. రాష్ట్రాల్లోని బిజెపియేతర ప్రభుత్వాలను అస్థిరపరచడానికే అధికార పార్టీ ఈ బిల్లులను తీసుకొస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. రాజకీయ ప్రత్యర్థుల అణచివేతకు,వారెన్సీయాని వేధించడానికి ఇవి ఒక సాధనంగా ఉపయోగపడతాయని విపక్ష నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ కొత్త నిబంధనలు సమాఖ్య వ్యవస్థ ను బలహీనపరుస్తాయని, రాష్ట్ర ప్రభుత్వాల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తాయని ప్రతిపక్షాలు వాదిస్తున్నాయి. అయితే ఈ బిల్లులు రాజకీయాల్లో నేరాలను తగ్గించి, పారదర్శకతను పెంచుతాయని అధికార పక్షం వాదిస్తోంది. ఈ బిల్లులు చట్టాలుగా మారితే భారత రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయో చూడాలి.

## తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి..



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఉప రాష్ట్రపతి ఎన్నికపై ఫుల్ క్లారిటీ వచ్చేసిందే. ఇప్పటికే ఎన్డీఏ నుంచి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణ, ఇండియా కూటమి నుంచి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి బరిలోకి దిగారు. ఈ నేపథ్యంలో అటు బీజేపీ.. అటు కాంగ్రెస్ తమ అభ్యర్థులను మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టాయి. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలుగు రాష్ట్రాల్లోన్ని అన్ని రాజకీయ పార్టీలకు కీలక పిలుపునిచ్చారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు.ఇండియా కూటమి అభ్యర్థి తెలంగాణ బిడ్డ కావడం మరింత గర్వకారణంగా ఉందని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పార్టీలన్నీ సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. గతంలో పీవీ నరసింహా రావు రాష్ట్రం నుంచి పోటీ చేస్తే ఎన్టీఆర్ ఆయనకు పోటీగా అభ్యర్థిని పెట్టక తెలుగు వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టారో.. నేడు చంద్రబాబు కూడా అదే విధంగా వ్యవహరించాలని తన ప్రతిష్టను నిలబెట్టుకోవాలని అన్నారు. ఇక పవన్ కళ్యాణ్ తో పాటు కేసీఆర్, జగన్ లు కూడా సుదర్శన్ రెడ్డికి మద్దతు తెలిపి తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాపాడా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పిలుపునిచ్చారు.

## సంపాదకీయం

# ఓట్ల చోరీ జరిగిందా.. లేదా..?




సాధారణంగా అధికార పక్షం వర్సెస్ ప్రతిపక్షంగా సాగాల్సిన రాజకీయం.. ఇప్పుడు ఈసీ వర్సెస్ ప్రతిపక్షంగా మారింది. ఈసీ కూడా ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్ష నేతల ఆరోపణలకు దీటుగా కౌంటర్లు ఇవ్వడం.. పరిశీలకుల్ని ఆశ్చర్యపరుస్తోంది. స్వతంత్ర భారతంలో ఎన్నికల నిర్వహణ బాధ్యత ఈసీకి అప్పగించింది రాజ్యాంగం. ఇప్పటివరకు ఎన్నో ఎన్నికలు నిర్వహించిన ఈసీ.. ఎన్నికల షెడ్యూల్ విడుదల కోసం తప్ప.. ప్రత్యేకంగా ప్రెస్ మీట్ పెట్టిన సందర్భాలు దాదాపుగా లేవనే చెప్పాలి. ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలు అభ్యంతరం వ్యక్తం చేస్తే.. సహజంగా అధికారుల స్థాయిలోనే సమాధానాలు, వివరణలు వస్తాయి. అంతేకానీ నేరుగా సీఈసీ రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఎప్పుడూ ఏర్పడలేదు. కానీ కొంతకాలంగా ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు శృతి మించుతున్నాయి. జనామోదంతో గెలవాల్సిన ఎన్నికల్ని ఈసీ సాయంతో గెలుస్తున్నారన్న ఆరోపణలు ఎన్నికల సంఘాన్ని ఇరుకునపెడుతున్నాయి. దీంతో తన ప్రతిష్ఠ కాపాడుకోవటానికి ప్రయత్నించిన ఈసీ.. ఆ సందర్భంగా సవాల్ కు ప్రతిసవాల్ విసురుతున్నట్టుగా స్పందించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమౌతున్నాయి. ఈసీ టోన్ లో మార్పు ఎందుకొచ్చిందనే ప్రశ్నలు వస్తున్నాయి.ఇటీవలి లోక్ సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ఇండియా కూటమి.. ఆ తర్వాత జరిగిన రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ గెలుపుపై అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ప్రీపోల్ సర్వేలు, ముందస్తు అభిప్రాయాలకు విరుద్ధంగా ఫలితాలు రావడంపై సందేహాలు వెలిబుచ్చింది. మొదట హరియాణా, తర్వాత మహారాష్ట్రలో ఫలితాలు ఇదే రీతిగా వచ్చాయని గగ్గోలు రేగింది. హరియాణాతో పోలిస్తే మహారాష్ట్ర ఫలితాన్ని సీరియస్ గా తీసుకున్న ఇండియా కూటమి.. అప్పట్నుంచి ఓట్ల శాతం విషయంలో తేడా జరిగిందని చెబుతూనే వచ్చింది. అయితే ఈసీ నుంచి సరైన వివరణ రాలేదనే ఆరోపణలూ ఉన్నాయి. ఈ రగడ ఇలా జరుగుతుండగానే.. బీహార్లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియ మొదలుకావడంతో.. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఫైరైంది. మహారాష్ట్రలో జరిగిందే.. బీహార్లోనూ జరుగుతుందనే అనుమానం వ్యక్తం చేసింది. ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ మరో అడుగు ముందుకేసి.. 2024 లోక్ సభ ఎన్నికల సందర్భంగా కర్ణాటకలోని ఓ అసెంబ్లీ సెగ్మెంట్ లో భారీగా ఓట్ల అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఒక ప్రజెంటేషన్ ఇచ్చారు. అలాగే ఈసీ జాబితాలో చనిపోయిన ఓటర్లంటూ.. వారితో కలిసి భోజనం చేశారు. నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించాల్సిన ఈసీ.. బీజేపీతో కుమ్మక్కైందని తీవ్ర ఆరోపణలు చేశారు.ఒకే ఓటరు పేరు పలుమార్లు నమోదు కావడం, ఇతర రాష్ట్రాల ఓటర్ల జాబితాలోనూ అదే వ్యక్తి పేరు ఉండటం, ఉనికిలో లేని చిరునామాలలో ఓటర్లు ఉండటం, ఒకే ఇంటి నంబర్ పై వందలాది ఓట్లు ఉండటం, ఫొటోలు సరిగా లేని గుర్తింపు కార్డులు, కొత్త ఓటర్ల కోసం ఉద్దేశించిన ఫారం-6 దుర్వినియోగం లాంటి అనేక అవకతవకలను తాము తమ సర్వేలో గుర్తించామని తన ప్రజెంటేషన్ లో రాహుల్ గాంధీ వివరించారు. అదేవిధంగా అధికార బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ను రూపొందించిందని, డిజిటల్ ఓటర్ల జాబితాను తమకు ఇవ్వడానికి నిరాకరించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అనుకూలురైన వ్యక్తులను ఓటర్ల జాబితాలో చేర్చి, వ్యతిరేకుల పేర్లు తొలగించి ఎన్నికల్లో నెగ్గేలా పెద్ద కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. బిహార్ లోని ససారాంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓటర్ అధికార్ యాత్రను రాహుల్ ప్రారంభించారు. ఓటర్ అధికార్ యాత్ర బిహార్ లో 20 జిల్లాలను చుడుతూ 16 రోజుల పాటు.. 1300 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. సెప్టెంబర్ 1న పాట్నాలో ఈ యాత్ర ముగుస్తుంది. ఆదివారం రాహుల్ సభలో ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్, తేజస్వీ యాదవ్, సీపీఎం, సీపీఐ ఎంఎల్ నేతలు పాల్గొన్నారు.ఓట్ల చోరీని బయటపెట్టాక ఈసీకి దిక్కుతోచడం లేదని ఎద్దేవా చేశారు రాహుల్. అందుకే అఫిడవిట్ దాఖలు చేయాలనే డిమాండ్లను తెరపైకి తెస్తోందని ఆరోపించారు. ఓట్ల చోరీపై బీజేపీ నేతలు కూడా ప్రెస్ మీట్ పెట్టి ఆరోపణలు చేశారు. అఫిడవిట్ దాఖలు చేయాలని వారినెందుకు అడగలేదని నిలదీశారు రాహుల్. ఎన్నికల వీడియో ఫుటేజీ కోరితే ఈసీ స్పందించకపోవడం వెనక మతలబేమిటని ప్రశ్నించారు. అధికార పక్షం అడ్డగోలుగా మాట్లాడుతోందని, ఈసీ స్పందన కూడా వారికి వంత పాడుతున్నట్టుగానే ఉందని రాహుల్ గాంధీ పదే పదే చెబుతున్నారు. ఇటీవల లోక్ సభతో పాటు పలు అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీతోనే బీజేపీ గెలిచిందినేది కాంగ్రెస్ ఆరోపణ. మహారాష్ట్రలో కోటి మంది కొత్త ఓటర్లను చేర్చి అధికారంలోకి వచ్చింది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆదే కుతంత్రం మొదలైంది. అడ్డదారిలో నెగ్గజూస్తున్నారు. వారి కుట్రలు సాగనివ్వమంటోంది ఆ పార్టీ. ఓట్ల చోరీపై రాహుల్ ఆందోళనతో ఇండియా కూటమి కూడా ఒక్కతాటిపైకి వచ్చింది. ఇండియా కూటమి పక్షాలన్నీ ఈ విషయంలో రాహుల్ కు మద్దతు ప్రకటించాయి. ఇప్పటికే కలిసికట్టుగా ఆందోళన చేస్తున్నాయి ఇండియా కూటమి పార్టీలు. ఇదే అంశంపై ఈసీ ఆఫీస్ ముట్టడికి ప్రయత్నించిన ఇండియా కూటమి ఎంపీలు సామూహికంగా అరెస్ట్ కూడా అయ్యారు. ఏం చేసినా.. ఈసీ తప్పించుకోలేదని, కచ్చితంగా దేశ ప్రజలకు వాస్తవాలు తెలియాలని ఇండియా కూటమి ఎంపీలు నినదిస్తున్నారు. చివరకు పార్లమెంట్ లో కూడా ఓట్ల చోరీ గురించే రగడ చేస్తున్నాయి ప్రతిపక్షాలు.ఈ రోజున దేశంలో అతి పెద్ద చర్చకు ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దారి చూపించారు. ప్రజాస్వామ్యానికి మూలాధారం అయిన ఎన్నికల వ్యవస్థ మీదనే ఆయన అనేక సందేహాలను వ్యక్తం చేశారు. దేశంలో ఓట్లు పెద్ద ఎత్తున చోరీకి గురి అవుతున్నాయని రాహుల్ చేసిన తీవ్ర ఆరోపణలు దేశవ్యాప్తంగా రచ్చకు అవకాశం ఇస్తున్నాయి. ఎన్నికల్లో ఫేక్ ఐడీలు దొంగ ఓట్లు తప్పుడు చిరునామాలు లక్షల ఓట్ల గల్లంతు, జత చేయడాలు ఇవన్నీ రాహుల్ గాంధీ దేశం ముందు ప్రశ్నలు గా పెట్టారు. రాహుల్ గాంధీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వడం ద్వారా అనేక సందేహాలు లేవనెత్తారు. రాహుల్ వాదనను దేశ ప్రజలు ఎంతవరకు నమ్ముతారనే విషయాన్ని పక్కనపెడితే.. ఓటర్ల జాబితా తయారీలో ఏదో జరుగుతోందనే అనుమానమైతే దేశ ప్రజల్లో మొదలైందనే భావనకు ఇండియా కూటమి అంకురార్పణ చేసింది.




# ఏడాదిలో హైడ్రా ఏం చేసింది?

''నెగిటివ్ న్యూస్ వేగంగా వ్యాప్తి చెందుతుంది. పాజిటివ్ న్యూస్ అంత వేగంగా వెళ్లదు కదా! అందుకే హైడ్రాను ఓ బూచిలానో.. భూతంలానో చూపించారు'' అంటున్నారు హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్.హైడ్రా అంటే.. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ. పూర్తి పేరు ఎంతో మందికి తెలియకపోవచ్చు గానీ, 'హైడ్రా' అనగానే ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో సుపరిచితమే.ఈ వ్యవస్థ ఏర్పడి ఏడాది అయింది. మరి ఈ కాలంలో ఏం చేసింది, దాని చుట్టూ విమర్శలేమిటి?హైదరాబాద్ చుట్టూ ఉన్న ఔటర్ రింగు రోడ్డు లోపలి ప్రాంతంలో హైడ్రా పనిచేస్తోంది.మొదటి విడతలో ప్రయోగాత్మకంగా ఆరు చెరువులు బాగు చేస్తున్నట్లు హైడ్రా చెబుతోంది.''వీటిని ఒక మోడల్‌గా తీర్చిదిద్దుతున్నాం'' అని చెప్పారు హైడ్రా కమిషనర్ రంగనాథ్.ఆ తర్వాత మిగిలిన చెరువులను ప్రభుత్వం తరపున, ఎన్జీవోల సహకారంతో బాగు చేయాలనేది ప్రణాళిక.ఇందుకు లాభాపేక్ష లేని ఎన్జీవోల సహకారం తీసుకుంటామని రంగనాథ్ చెబుతున్నారు.హైడ్రా పునరుద్ధరిస్తున్నట్లుగా చెబుతున్న బతుకమ్మకుంట ప్రాంతాన్ని సందర్శించింది.ఇప్పుడు అక్కడ పనులు ఇంకా పూర్తి కాలేదు. చుట్టూ కట్ట నిర్మించి రాళ్లతో పటిష్టం చేస్తున్నారు.''సెప్టెంబరు 21న బతుకమ్మ పండుగ నాటికి పనులు పూర్తి చేసి సీఎంతో ప్రారంభోత్సవం చేయిస్తాం'' అని చెప్పారు రంగానాథ్.ఇటీవలి వర్షాలకు బతుకమ్మకుంటలోకి భారీగా వరద నీరు చేరడంతో.. ఆ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.బతుకమ్మకుంట మళ్లీ ఇంత చక్కగా మారుతుందని అనుకోలేదని బాగ్ అంబర్‌పేటకు చెందిన సురేష్ కుమార్ గాంధీ చెప్పారు.50 ఏళ్లుగా గాంధీ కుటుంబం బతుకమ్మకుంట వద్ద కిరాణా దుకాణం నడిపిస్తోంది.''ఒకప్పుడు చెత్తాచెదారం ఉండేది. ఇప్పుడు ఫస్ట్ క్లాస్ అయిపోయింది'' అని చెప్పారు.ఇక్కడ ఎవర్నీ కదిలించినా ఇదే చెబుతున్నారు.చెత్తాచెదారంతో నిండిన ప్రదేశం కుంటగా మారిందని స్థానికుడు చంద్రశేఖర్ చెప్పారు.''బతుకమ్మ కుంటలోకి మురుగునీరు కలవకుండా చూడాలి'' అని కోరారు.పునరుద్ధరణ పనుల కారణంగా భూగర్భ జలాల్లో స్వచ్ఛత మెరుగైందని బాగ్ అంబర్‌పేటకు చెందిన సీపీఎం హైదరాబాద్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.మహేందర్ చెప్పారు.''మా బతుకమ్మకుంట పరిసరాల్లో భూగర్భ జలాలు మంచిగా అయ్యాయి'' అన్నారు.ఇక హైడ్రా వచ్చాక అత్యంత వివాదాస్పదమైనది తమ్మిడికుంట.సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను ఈ తమ్మిడికుంట ఎఫ్‌టీఎల్ (ఫుల్‌ట్యాంక్ లెవెల్) పరిధిలో నిర్మించారనే ఆరోపణలపై నిరుడు ఆగస్టులో హైడ్రా కూల్చివేసింది. ఇది జరిగి దాదాపు ఏడాదవుతోంది. చెరువును పునరుద్ధరిస్తామని హైడ్రా చెప్పినా, పనులు ఇంకా పూర్తి కాలేదు.ప్రస్తుతం చుట్టూ కట్ట నిర్మాణం జరుగుతోంది. ఎన్ కన్వెన్షన్ శిథిలాలను అక్కడి నుంచి తీసివేశారు.అయితే, చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధరణపై హైడ్రా ఏకపక్షంగా వ్యవహరిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.''తమ్మిడికుంటకు గతంలో ఉన్న ఎఫ్‌టీఎల్ హద్దు రాళ్లు పీకేసి దౌర్జన్యంగా మా భూములు హైడ్రా గుంజుకుంది. కనీసం మాకు నోటీసులు కూడా ఇవ్వలేదు'' అని ఆరోపించారు శ్రీనివాసరెడ్డి.ఈయనకు తమ్మిడికుంట పక్కనే ఉన్న భూమిలోని 1200 గజాల స్థలాన్ని కుంట విస్తరణ కోసం ఏకపక్షంగా హైడ్రా తీసుకుందని విమర్శిస్తున్నారు.దీనివల్ల తన గోశాల స్థలం కోల్పోయానని చెబుతున్నారు.ఈ ఆరోపణలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఖండించారు.''ఆ చెరువు(తమ్మిడికుంట) 29-30 ఎకరాల ఎఫ్‌టీఎల్వి స్తీర్ణంలో ఉండేది. తర్వాత అది 13-14 ఎకరాలకు తగ్గిపోయింది. ఇప్పుడు చెరువును డెవలప్ చేస్తూ 29 ఎకరాలకు తీసుకువస్తున్నాం'' అని చెప్పారు.''చెరువు డెవలప్‌మెంట్ ఉండాలి. ఉండొద్దని మేం అనడం లేదు. కాకపోతే చెరువు వాస్తవంగా ఎంత ఉందో చూసుకోవాలి. అందుకు తగ్గట్టుగా మార్కింగ్ జరగాలి'' అని శ్రీనివాసరెడ్డి అన్నారు.తమ్మిడికుంట వివాదంపై పట్టాదారులు హైకోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిపివేయాలని కోర్టు స్టే జారీ చేసింది.ఏడాది కాలంలో హైడ్రా పేరు ఎత్తితే కూల్చివేతలే అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది.ఎక్కడ ఏ కూల్చివేత జరిగినా, హైడ్రా కూల్చివేస్తోందనే ప్రచారం విపరీతంగా సోషల్ మీడియాలో జరుగుతోంది.''అసలు మాకు సంబంధం లేని విషయాలను మాకు ఆపాదిస్తూ తప్పుడు సమాచారం పెద్దఎత్తున వ్యాప్తి చేశారు. రాజకీయంగానో, భూకబ్జాదారుల నుంచో ఇలాంటి తప్పుడు సమాచార వ్యాప్తి జరిగి ఉండొచ్చు'' అని రంగనాథ్ చెప్పారు.హైడ్రా దూకుడుగా వెళ్లడం, సెలబ్రిటీలపైనా చర్యలు తీసుకోవడంతోనే ప్రజల్లోకి ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్), బఫర్ జోన్ అనే విషయాలు బలంగా వెళ్లాయని ఆయన చెబుతున్నారు.ఇదే విషయంపై సీపీఎం హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.మహేందర్ మాట్లాడారు.''చెరువుల ఆక్రమణలను వ్యతిరేకిస్తున్నాం. అదే సమయంలో బతుకు దెరువు కోసం నగరానికి వచ్చి నివసిస్తున్న పేదవాళ్ల ఇళ్లు కూలగొట్టడం సమంజసం కాదు. వాళ్లకు ప్రత్యమ్నాయం చూపించాలి'' అని డిమాండ్ చేశారు.చెరువుల వద్ద స్థలాలు అమ్మిన వారిపైనా కేసులు పెడుతున్నామని రంగనాథ్ చెప్పారు.''అవును, హైడ్రా విషయంలో మొదట్లో కొన్ని పొరపాట్లు జరిగాయి. కాదనడం లేదు. ఇప్పుడు అవన్నీ సరిదిద్దుకుని ముందుకు వెళుతున్నాం'' అని రంగనాథ్ చెప్పారు.అలాగే అనుమతులు ఇచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకుంటున్నట్లుగా చెప్పారు.హైడ్రా అనగానే కూల్చివేతలనే ఆపవాదు పోగొట్టుకునేందుకే మొదట చెరువుల పునరుద్ధరణ చేసి చూపించాలని భావిస్తోంది హైడ్రా.బతుకమ్మకుంట, తమ్మిడికుంటతోపాటు సున్నంచెరువు, ఉప్పల్ నల్లచెరువు సహా ఆరు చెరువులలో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లుగా హైడ్రా చెబుతోంది.ఈ చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు ఇంకా ఎక్కడా పూర్తి స్థాయిలో పనులు కాలేదు. చెరువులో మట్టి తీసి కట్ట పటిష్టం చేసే పనులే నడుస్తున్నాయి.హైడ్రా మీద పెద్ద బాధ్యత ఉందని, దాన్ని ఆరు చెరువులకే పరిమితం చేసుకుంటోందని సేవ్ అవర్ అర్బన్ లేక్స్ కో కన్వీనర్ లుబ్నా సార్వత్ చెప్పారు.అయితే, నగరంలో చెరువుల పునరుద్ధరణ దశల వారీగా జరగనున్నాయని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెప్పారు.''ఇదొక యజ్ఞంలా చేయాల్సి ఉంది. ఇదేదో ఇప్పుడు ఒకేసారి అంతా అయిపోతుందని నేను అనను'' అన్నారు.కనీసం తొమ్మిది నెలల సమయం పడుతుందని చెప్పారు.హైడ్రాను 2024 జూలై 19న ఏర్పాటు చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, పార్కుల పరిరక్షణ, పునరుద్ధరణకు తోడు విపత్తుల నుంచి ప్రజలను కాపాడే బాధ్యత కూడా హైడ్రాపై ఉంది.ప్రత్యేకంగా హైడ్రా పోలీసుస్టేషన్ ఏర్పాటు చేసి సిబ్బందిని కేటాయించింది ప్రభుత్వం.2025-26 బడ్జెట్‌లో రూ.100 కోట్లను హైడ్రాకు కేటాయించగా, ఇప్పటివరకు రూ.50 కోట్లు మంజూరు చేసినట్లుగా అధికారులు చెబుతున్నారు.గత ఏడాదికాలంలో చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో ఉన్న 581 ఆక్రమణలను తొలగించినట్లుగా హైడ్రా ప్రకటించింది.మొత్తం 499 ఎకరాలను కబ్జాల చెర నుంచి విడిపించామని చెబుతోంది.''మేం ఇప్పటివరకు కాపాడిన భూముల విలువ మార్కెట్ విలువ ప్రకారం రూ.30 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా'' అని రంగనాథ్ చెప్పారు.ఆక్రమణల పేరుతో కనీసం నోటీసులు ఇవ్వకుండా నిర్మాణాలు తొలగిస్తున్నారనేది హైడ్రాపై ఉన్న విమర్శ.''కనీసం నోటీసులు ఇస్తే మాకు విషయం ఏంటో తెలుస్తుంది. తెల్లవారుజామున వచ్చి కూల్చివేస్తామంటే ఎక్కడికి వెళ్లాలి'' అని రాజేంద్రనగర్‌కు చెందిన ఓ మహిళ ప్రశ్నించారు.ఇటీవల రాజేంద్రనగర్‌లో కూల్చివేతల సందర్భంగా ఆమె జేసీబీకి అడ్డుగా పడుకుని నిరసన వ్యక్తం చేశారు.గతంలో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ సహా వివిధ ప్రాంతాల్లో కూల్చివేతలు మొదలైనప్పుడు కూడా ఇదే విమర్శలు వినిపించాయి.''మేం వెకేషన్ నోటీసులు (ఖాళీ చేయాలని చెప్పేది) ఇస్తున్నాం. యజమానులు వేరు, పొజిషన్లో వేరొకరు ఉండటంతో వారికి చేరడం లేదు'' అని రంగనాథ్ చెప్పారు.ఖాళీ చేయాలని టైం ఇస్తాం.. తర్వాతనే కూలగొడుతున్నామని వివరించారు.హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ లెక్కల ప్రకారం ఔటర్ రింగు రోడ్డు లోపల హెచ్‌ఎండీఏ పరిధిలో దాదాపు 600, జీహెచ్‌ఎంసీ పరిధిలో 185 చెరువులు కలుపుకొని మొత్తం 785 చెరువులున్నాయి.ఈ చెరువుల లెక్క 900 వరకు ఉంటుందని హైడ్రా అంచనా వేస్తోంది.చెరువుల పునరుద్ధరణకు తోడు వాటి మధ్య ఉన్న నాలాలు, వరద కాల్వలను పునరుద్ధరించాలని లుబ్నా సార్వత్ డిమాండ్ చేస్తున్నారు.''వర్షపు నీరు పడగానే పారేలా గ్రావిటీ ఛానెల్స్ తిరిగి ఏర్పాటు చేయాలి'' అని సూచించారు.ఆక్రమణల తొలగింపు విషయంలో కటాఫ్ డేట్ పెట్టుకోవాలని చెబుతున్నారు.హైడ్రా ఇళ్లను కూలుస్తుందా.. ఏయే నిర్మాణాలు కూల్చుతుందనే విషయంపై కమిషనర్ రంగనాథ్ స్పష్టత ఇచ్చారు.

''హైడ్రా ఏర్పడే నాటికి నివాస గృహాలు ఏవైతే ఉన్నాయో.. వాటి జోలికి వెళ్లడం లేదు. అవి ఎప్పుడో కట్టి ఉంటారు. కమర్షియల్ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకుంటుంది'' అని స్పష్టం చేశారు.నివాసాల విషయంలోనూ హైడ్రా ఏర్పడిన తర్వాత అనుమతులు తెచ్చుకుని మొదలుపెట్టిన నిర్మాణాలను కూల్చివేస్తామని స్పష్టం చేశారు.అయితే హైడ్రా ఏర్పడేనాటికే అనుమతులు ఉంటే వాటిని పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు.హైడ్రా వచ్చాక ఈ ఏడాదిలో చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు చెరువుల ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్ విషయంలో ఎంతో అవగాహన వచ్చింది.''ఈ విషయంలో మేం విజయం సాధించాం'' అని రంగనాథ్ చెప్పారు.హైడ్రా వచ్చినప్పట్నుంచి హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోయిందనేది ప్రధానంగా ఎదురవుతున్న విమర్శ.అయితే, గతేడాది మే నెలతో పోల్చితే, ఈ ఏడాది మే నెలలో 14 శాతం ఆస్తి రిజిస్ట్రేషన్లు పెరిగినట్లుగా నైట్ ఫ్రాంక్ ఇండియా విడుదల చేసిన తాజా నివేదిక చెబుతోంది.అన్ని అనుమతులు ఉన్న ప్రాజెక్టులకు హైడ్రా పరంగా ఎలాంటి ఇబ్బంది లేదని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.జైదీప్ రెడ్డి చెప్పారు.''ఏదైనా వ్యవస్థ కొత్తగా వచ్చినప్పుడు ఇబ్బందులుంటాయి. హైడ్రా పరంగా మొదట్లో కొంత ఉంది. ఇప్పుడంతా కుదురుకుంది'' అని వివరించారు.రియల్ ఎస్టేట్ దెబ్బతిందనే వాదనను హైడ్రా ఖండించింది.''దేశవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ తగ్గుముఖం పట్టింది. అలా హైదరాబాద్‌లో కూడా తగ్గింది. ఇప్పుడు మళ్లీ పుంజుకుంది'' అని రంగనాథ్ చెప్పారు.హైదరాబాద్‌లో అయితే హైడ్రా ఉంది సరే, మరి వరంగల్, విజయవాడ, గుంటూరు, వైజాగ్‌లో ఎందుకు తగ్గిందనే విషయం కూడా ఆలోచించాలని చెప్పారు.పేదల ఇళ్లను కూల్చివేసి ప్రజాప్రతినిధుల జోలికి వెళ్లడం లేదనేది హైడ్రాపై ఈ ఏడాది కాలంలో వినిపించిన మాట.మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన యూనివర్సిటీ భవనాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీలోని హాస్టల్ భవనాలు, ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీకి చెందిన ఫాతిమా కాలేజీ చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయనే ఆరోపణలున్నాయి.అయితే, తమ యూనివర్సిటీకి చెందిన భవనాలు చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో లేవని మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి ఖండించారు.ఈ ఆరోపణలపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడారు.''మల్లారెడ్డి యూనివర్సిటీ, అనురాగ్ యూనివర్సిటీ వద్ద ఉన్న చెరువులకు ఎఫ్‌టీఎల్ ప్రిలిమినరీ నోటిఫికేషనే ఇచ్చాం. వాటి ఫైనల్ నోటిఫికేషన్ వస్తేనే, దాని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోగలం'' అని చెప్పారు.ఎన్ కన్వెన్షన్ ఉన్న తమ్మిడికుంట చెరువు ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వడంతో చెరువులో ఉందనే కూల్చివేశామని చెప్పారు.''సల్కం చెరువు వద్ద ఫాతిమా కాలేజీ 2015లో నిర్మిస్తే, ఆ చెరువుకు 2016 డిసెంబరు 16వ తేదీన ప్రిలిమినరీ నోటిఫికేషన్ వచ్చింది. ఇప్పటికే అక్కడ ఎంఎం కాలనీ వచ్చి వందలాది ఇళ్లు కూడా ఉన్నాయి'' అని చెప్పారు.ఫైనల్ నోటిఫికేషన్ రాకపోవడంతోపాటు పేదలకు ఉచిత విద్య అందిస్తున్న విషయాలను పరిగణనలోకి ఫాతిమా కాలేజీపై చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు.ఈ వివాదంపై ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ కూడా స్పందించారు.''ఫాతిమా కాలేజీ చెరువులో లేదు. ఎంతో మంది పేదలకు ఉచితంగా విద్య అందిస్తున్న కాలేజీపై చర్యలు తీసుకోవద్దని కోరుతున్నా'' అని చెప్పారు.మజ్లిస్ పార్టీ అని మెతక వైఖరి లేదని చెబుతున్నారు రంగనాథ్.చాంద్రాయణగుట్టలో మజ్లిస్ కార్పొరేటర్‌కు చెందిన నిర్మాణాలు కూల్చివేసిన విషయాన్ని ఆయన గుర్తుచేస్తున్నారు.''హైడ్రా ఇక్కడ లాలూచీ పడింది. అక్కడ భయపడుతోందంటున్నారు. మాకు ఒక విధానం, ఓ వ్యూహం ఉన్నాయి. దాని ప్రకారమే వెళతాం. ఎవరినో ఏదో చేయడానికి హైడ్రా పనిచేయడం లేదు'' అని రంగనాథ్ స్పష్టం చేశారు.




సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి
9951512539
flashindia999@gmail.com

# ఢిల్లీ సీఎంకు చేదు అనుభవం..

- ఢిల్లీ సీఎంకు చేదు అనుభవం
- రేఖా గుప్తాను చెంపదెబ్బ కొట్టిన యువకుడు
- నిందితుడ్ని అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు



**ఢిల్లీ :** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు చేదు అనుభవం ఎదురైంది. బుధవారం ఉదయం తన నివాసంలో రేఖా గుప్తాను ఒక యువకుడు చెంపదెబ్బ కొట్టాడు. ఈ హఠాత్పరిణామంతో రేఖా గుప్తా సహా అధికారులు షాక్‌కు గురయ్యారు.రేఖా గుప్తాను చెంపదెబ్బ కొట్టి, జుట్టు లాగడంతో ఆసుపత్రి పాలయ్యారని బీజేపీ నాయకులు తెలిపారు. 30 ఏళ్ల వయసున్న యువకుడు 'జనసభ' సందర్భంగా ముఖ్యమంత్రి దగ్గరకు వచ్చి దాడికి పాల్పడ్డాడు. ముఖ్యమంత్రి భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై దాడి చేసిన యువకుడిని పట్టుకున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.ముఖ్యమంత్రి నివాసంలో జనసభ జరుగుతుండగా రేఖా గుప్తాపై తొలుత యువకుడు గట్టిగా అరిచాడు. అనంతరం ఆమె చెంపపై కొట్టాడు. అనంతరం దుర్భాషలాడాడు. ముఖ్యమంత్రితో యువకుడు తీవ్ర ఘర్షణకు దిగాడు. ఆ సమయంలో భద్రతా సిబ్బంది అడ్డుకోకపోవడం పెద్ద భద్రతా లోపంగా కనిపిస్తోంది.ప్రస్తుతం ముఖ్యమంత్రి నివాసం దగ్గర భారీగా భద్రతా పెంచారు. ఒక యువకుడు అంత దగ్గరగా ముఖ్యమంత్రి దగ్గరకు ఎలా వెళ్లాడన్న దానిపై దర్యాప్తు చేస్తున్నారు. భద్రతా సిబ్బందిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. అలాగే సీసీటీవీ ఫుటేజ్‌ను కూడా పరిశీలిస్తున్నారు.ముఖ్యమంత్రి రేఖా గుప్తాకు తొలుత ఒక పత్రాన్ని సమర్పించాడు. వెంటనే ఆమెపై అరవడం ప్రారంభించాడు. ఇంతలోనే చెంపదెబ్బ కొట్టి దుర్భాషలాడాడు. అయితే అతడి వ్యాఖ్యలను బట్టి చూస్తే.. పార్టీ వైఖరి పట్ల అసంతృప్తితో ఉన్న వ్యక్తే ఈ దాడి చేసినట్లుగా ఆ పార్టీ అధికారి ప్రతినిధి ప్రవీణ్ శంకర్ వ్యాఖ్యానించారు. అంటే పార్టీలో అంతర్గత విభేదాలు కారణంగానే ఈ దాడి జరిగి ఉండొచ్చని కాషాయ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు.

# ప్రీ ప్రైమరీ స్కూళ్లలో సిబ్బంది కొరత..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఆరంభ శూరత్వం అన్న మాట పాఠశాల విద్యాశాఖకి సరిగ్గా సరిపోతుంది. ప్రభుత్వ బడులపై నమ్మకం పెంచేలా సర్కారు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నా.. అవి ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికి పైగా ప్రాథమిక పాఠశాలల్లో ఇటీవల ప్రారంభించిన ప్రీప్రైమరీ తరగతుల్లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తున్నది. ఇన్ స్ట్రక్టర్లు, ఆయాలు లేకుండానే ఈ తరగతులు నడుస్తున్నాయని, దీనివల్ల విద్యార్థుల బోధన, పర్యవేక్షణ కష్టమవుతోందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు వెయ్యి ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రారంభించారు. అయితే, ఈ తరగతులకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించలేదు. ప్రస్తుతం ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్టీజీ)లతోనే ఈ క్లాసులను నిర్వహించాలని డీఈఓల నుంచి ఆదేశాలు ఉన్నాయని, దీంతో ఇప్పటికే ఉన్న పనిభారంపై అదనపు భారం పడుతున్నదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. స్థానిక జిల్లా విద్యాశాఖ అధికారులు (డీఈఓలు) సైతం ఈ సమస్యపై స్పందించడం లేదు. ప్రీప్రైమరీ తరగతులకు సంబంధించిన సిబ్బంది నియామకంపై ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని సమాచారం. ఈ విషయంపై స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్ మెంట్ కూడా ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన చేయలేదు. సంబంధిత డీఈఓలకు రిక్రూట్ మెంట్ చేసుకోమని ఆదేశాలు ఇచ్చామంటూ అధికారులు దాటవేస్తున్నారు. దీంతో, ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణపై తీవ్ర గందరగోళం నెలకొంది.2025-26 విద్యా సంవత్సరం ప్రారంభమైన జూన్ 12న రాష్ట్రంలోని 210 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులకు అనుమతులిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సరిగ్గా నెలరోజుల తర్వాత జులై 16న 790 స్కూళ్లలో ప్రీ ప్రైమరీ తరగతులకు అనుమతులిచ్చింది. పిల్లల సంఖ్య ఎక్కువగా ఉన్న ప్రీప్రైమరీ తరగతుల్లో ఇన్ స్ట్రక్టర్, సహాయకుల అవసరం తప్పనిసరి. కానీ, వీరు లేకుండా తరగతులు నడపడం పిల్లల భవిష్యత్తుకు ఆందోళన కలిగిస్తున్నదని గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రయివేటు స్కూళ్లలో లాగే ప్రీప్రైమరీ తరగతులు నిరాంటకంగా నడుస్తున్నాయని భావించామని, కానీ విద్యాశాఖ నిర్లక్ష్యంతో సిబ్బంది రిక్రూట్ మెంట్ లో అలసత్వం ఏమిటని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వం తక్షణమే ఈ సమస్యపై దృష్టి సారించి, ప్రీప్రైమరీ తరగతులకు అవసరమైన సిబ్బందిని నియమించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయసంఘాల నాయకులు కోరుతున్నారు.

# అహ్మదాబాద్‌లో దారుణం..

## టెన్త్ విద్యార్థిని చంపిన జూనియర్

**గుజరాత్ :** గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ లో దారుణం జరిగింది. పదో తరగతి విద్యార్థి-తొమ్మిదో తరగతి విద్యార్థి మధ్య జరిగిన ఘర్షణ హత్యకు దారి తీసింది. దీంతో తల్లిదండ్రుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబికాయి. స్కూల్ ఫర్నీచర్, అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి

వచ్చింది.అహ్మదాబాద్ లోని ఖోఖారాలోని సెవెంత్ డే స్కూల్. అదే స్కూల్ కు చెందిన టెన్త్ విద్యార్థి- 9వ తరగతి చదువుతున్న విద్యార్థి మధ్య ఘర్షణ జరిగింది. ఇద్దరి మధ్య ఘర్షణ కారణంగా స్కూల్ వెలుపల టెన్త్ విద్యార్థిని కత్తితో పొడిచాడు. దీంతో బాధితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు.ఈ హత్య తర్వాత సింధీ కమ్యూనిటీకి చెందిన సభ్యులు పెద్ద ఎత్తున పాఠశాలకు వచ్చి విధ్వంసం సృష్టించారు. పాఠశాల ఆవరణలో నిలబడి ఆందోళన చేపట్టారు. అనంతరం పార్క్ చేసిన పాఠశాల బస్సులు, కార్లు, బైక్ లు ధ్వంసం చేశారు. అంతేకాకుండా పాఠశాల ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అలాగే స్కూల్ సిబ్బందిని, ప్రిన్సిపాల్ పై కూడా దాడికి పాల్పడ్డారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బాధితుడు సింధీ వర్గానికొ చెందిన వాడు కాగా.. నిందితుడు ముస్లిం వర్గానికి చెందిన వాడు కావడంతో ఉద్రిక్తతలకు దారి తీసింది. ప్రస్తుతం హిందూ సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. ఇక నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇంకోవైపు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబం డిమాండ్ చేస్తోంది.

# ఆస్పత్రిలో వైద్య బృందం తనిఖీలు



**తుంగతుర్తి,ఫ్లాష్ ఇండియా :** తుంగతుర్తి మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం వికటించి మహిళ మృతి చెందిన సంఘటనపై సూర్యాపేట జిల్లా వైద్య శాఖ బృందం బుధవారం విచారణ పట్టింది. డీఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పి. చంద్రశేఖర్, డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓలు డాక్టర్ జి. చంద్రశేఖర్, డాక్టర్ జయ, ఎంసిహెచ్ పిసిఎన్ డి టి ప్రోగ్రాం ఇంచార్జి డాక్టర్ నజియాతో పాటు పలువురు ఇందులో ఉన్నారు. ఆస్పత్రిలో ఉన్న మొత్తం గదులన్నీ బృందం తనిఖీ చేపట్టింది. ముఖ్యంగా ప్రముఖ డాక్టర్లకు చెందిన స్టాంపులు, మందులు, తదితరవి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో రావులపల్లి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ లింగమూర్తితో పాటు తదితరులు పాల్గొన్నారు. కాగా ఇప్పటికే ఆస్పత్రిలో రాష్ట్ర, జిల్లా వైద్య బృందాలు తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే.

# అడ్డగోలుగా ఇసుక వ్యాపారం..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఇసుక మాఫియా మరోసారి దూకుడు పెంచింది. నదులు, వాగులు, వంకలు అనే తేడా లేకుండా తవ్వేస్తున్నది. స్థానికుల నేతల అండదండలతో అక్రమ వ్యాపారులు మూడు పూలు, ఆరు కాయలుగా కొనసాగుతున్నది. రాష్ట్రంలో ఇసుక మాఫియాను కట్టడి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని కఠిన నిబంధనలు తీసుకొచ్చినా దందా మాత్రం ఆగడం లేదు.రాష్ట్రంలోని మూసీ, డిండి, మంజీరా వాగుల నుంచి పెద్ద సంఖ్యలో లారీల ద్వారా పట్టణ కేంద్రాలకు తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన లక్షల ఆదాయానికి గండి పడుతున్నది. అక్రమ ఇసుకను స్థానిక లీడర్లు వాగుల వద్ద దగ్గరుండి మైనింగ్, పోలీసు అధికారులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ దందాను నడుపుతున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు నాయకుల పుత్రరత్నాలు, బంధుగణం పూర్తిగా ఇసుక దందాపై ఫోకస్‌పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక వాగులో నుంచి ప్రధాన రహదారి వరకు వారే బాధ్యత తీసుకుని అక్రమ ఇసుక రవాణాకు అండగా నిలుస్తున్నారు. నగరం చుట్టుపక్కల జిల్లాల నుంచి అక్రమ ఇసుక రావడంతో ప్రభుత్వం వేలం ద్వారా దక్కించుకున్న ఇసుక రీచ్‌లకు ఆశించిన గిరాకీ లేదు.రాష్ట్రంలో ప్రస్తుతం 11 జిల్లాలో 32 ఇసుకు రీచ్‌లు అధికారంగా నడుస్తుండగా, అక్రమంగా 50 వరకు రీచ్‌లు ఉన్నట్లు తెలుస్తోంది. గోదావరి, మంజీరా, కృష్ణా, తుంగభద్ర నదుల్లో నుంచి ప్రభుత్వం ఇసుక తవ్వకాలు జరుపుతున్నది. లారీల యజమానులు ఆన్‌లైన్‌బుకింగ్‌చేసుకుంటే వారికి ఎక్కడ క్వారీకి వస్తే అక్కడికి వెళ్లి లోడ్‌కు రూ.3వేల నగదు చెల్లించి పట్టణాలకు తరలిస్తున్నారు. అక్రమ క్వారీల నుంచి ఎలాంటి వే బిల్లు లేకుండా స్థానిక అదికారులకు ముడుపులు ఇస్తే చాలు ఇసుక లారీలో లోడ్ అవుతున్నది. అక్రమ క్వారీలో సిబ్బంది ఎలాంటి ఓఆర్డీలు లేకుండా లారీకి రూ.45వేలు తీసుకుని ఇసుక లోడ్‌చేస్తున్నారు. ఒకరి పేరుమీద పర్మిట్‌తీసుకొని ఐదారు లారీల ఇసుకను సరఫరా చేస్తున్నారు.గత బీఆర్ఎస్‌పాలనలో ఇసుక రవాణాకు లేని నిబంధనలు ఇప్పుడే ఏమిటని మైనింగ్‌అధికారులను స్థానిక లీడర్లు బెదిరింపులు చేస్తున్నారు. 'మా ప్రభుత్వం.. మా ఇష్టం.. మా పని మాదే, మీ పని మీదే' అన్నట్లు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నాయకుల బెదిరింపులతో అటువైపు కన్నెత్తి చూడాలంటే అధికారులు భయపడుతున్నారు. కొత్త రూల్స్‌వస్తే మీ కార్యాలయంలో పాటించాలని, తమ దందాకు అడ్డురావొద్దని సూచనలు చేస్తున్నట్లు తెలిసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టిన ఆరునెలల్లో మైనింగ్‌శాఖపై ప్రత్యేక దృష్టి సారించి కొత్త నిబంధనలు తీసుకొచ్చారు. ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని మైనింగ్ అధికారులను ఆదేశించినా ప్రకటనలకే పరిమితమైతుంది. ఓవర్ లోడ్, అక్రమ రవాణపై విజిలెన్స్ దాడులు చేసి, అక్రమార్కులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా చర్యలు చేపట్టాలని పలుమార్లు ఆదేశించారు. బ్లాక్ మార్కెట్ ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేసినా లీడర్ల బెదిరింపులకు అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం తప్ప మరొకటి లేదు. ఇసుక రీచ్ ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని చెప్పగా, అవి ప్రారంభంలోనే అమలు జరిగాయి. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్ తో పాటు ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఏర్పాటు చేయాలని సూచించినా పెద్దగా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు ఇసుక అందుబాటులో విధంగా నగరానికి నలువైపులా ఇసుక బజార్లను ఏర్పాటుచేసింది. అక్కడ దొడ్డు ఇసుక రూ.1600, సన్న ఇసుక రూ.1800కే అమ్మకాలు చేసేలా చర్యలు చేపట్టినా కొనుగోళ్లు లేక బజార్లు వెలవెల బోతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో రూ.2200 ఉన్నా లాభర్జన లేకుండా ప్రభుత్వం అమ్మకాలు చేపట్టింది. చౌక ధర నిర్ణయించడంతో పెద్ద నిర్మాణదారులు ఇక్కడే కొనుగోలు చేస్తారని మైనింగ్‌శాఖ ఆశించింది. కానీ వారంతా ఇసుక మాఫియా తీసుకొచ్చే ఇసుకనే వినియోగిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే ఇసుక బజార్ల వైపు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో ఇసుక బజార్లు మరో నాలుగైదు ఏర్పాటు చేయాలనుకునే నిర్ణయం వాయిదా వేసే పరిస్థితి నెలకొంది. ఉన్న వాటిని ఎలా నిర్వహించాలో తెలియక అధికారులు తలపట్టుకుంటున్నారు.

# భారత భవిష్యత్తు ఇలాంటి మేధావుల చేతుల్లో



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** అంగరంగ వైభవంగా జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ 84వ కాన్వొకేషన్ కార్యక్రమానికి ఇస్రో ఛైర్మన్ డా. వి. నారాయణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వ విశ్వని ఇన్స్టిట్యూషన్స్ కు చెందిన MSN చిన్ని MBA ఫైనాన్స్ లో టాపర్ గా నిలిచి, అత్యున్నత గౌరవం అయిన ప్రొఫెసర్ సముద్రాల సత్యనారాయణ మూర్తి స్మారక బంగారు పతకంను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్రో ఛైర్మన్ డా. వి. నారాయణన్ విద్యా ప్రాముఖ్యతను ప్రశంసించారు. ప్రొఫెసర్ ఎస్. ఎస్. మూర్తి స్మారక బంగారు పతకం ప్రదానం చేశారు. ఈ ప్రతిష్టాత్మక బంగారు పతకంను డా. శ్రీదేవసేన, IAS, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్, తన తండ్రి అయిన ప్రొఫెసర్ సముద్రాల సత్యనారాయణ మూర్తి జ్ఞాపకార్థం ప్రవేశపెట్టారు. ప్రతీ ఏడాది MBA ఫైనాన్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి ఈ బహుమతి ప్రదానం అవుతుంది. ప్రొఫెసర్ మూర్తి అత్యున్నత విద్యావేత్తగా, ఆదర్శ ఉపాధ్యాయుడిగా, నైతిక విలువలకు కట్టుబడి పనిచేసిన వారిగా ఎన్నో తరాలను స్ఫూర్తి పరిచారు.ఈ సందర్భంగా డా. నారాయణన్ మాట్లాడుతూ.. ఎం.ఎస్. చిన్ని వంటి ప్రతిభావంతులైన విద్యార్థుల విజయాలు మన విద్యా వ్యవస్థ బలాన్ని చాటుతున్నాయి. భారత భవిష్యత్తు ఇలాంటి మేధావుల చేతుల్లో ఉంది. ప్రొఫెసర్ మూర్తి వంటి మహోన్నత ఉపాధ్యాయుల వారసత్వం కొత్త తరాలను నడిపించడం ఎంతో సంతోషకరం అని అన్నారు. ప్రొఫెసర్ మూర్తి స్ఫూర్తితో ఆయన శిష్యులు శ్రీ. శ్రీనివాస్ ఆచార్య, జి.ఎస్.ఎస్.వి. రావు, హైదరాబాద్ లో విశ్వ విశ్వని ఇన్స్టిట్యూషన్స్ ను స్థాపించారు. తమ గురువు బోధించిన స్ఫూర్తిని ఆధునిక విద్యా వ్యవస్థలో విలీనం చేస్తూ.. శాస్త్రీయ క్రమశిక్షణ, పరిశ్రమ అనుసంధానంతోపాటు నైతిక విలువల సమన్వయంతో ఈ సంస్థను తీర్చిదిద్దారన్నారు.అలాగే సహ వ్యవస్థాపకులు శ్రీనివాస్ ఆచార్య మాట్లాడుతూ.. ఈ బంగారు పతకం మాకు గర్వకారణం. ఇది కేవలం విద్యా ప్రతిభ మాత్రమే కాదు.. మా గురువు ప్రొఫెసర్ మూర్తి విలువలు, వారసత్వానికి ప్రతీక అని అన్నారు. ఎం.ఎస్. చిన్ని విజయం మా కట్టుబాటును మరింత బలపరుస్తుందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. మరో సహ వ్యవస్థాపకులు జి.ఎస్.ఎస్.వి. రావు మాట్లాడుతూ.. ప్రొఫెసర్ మూర్తి ఆదర్శాలు విశ్వ విశ్వని పునాది. ఒస్మానియా యూనివర్సిటీ కాన్వొకేషన్ లో మా విద్యార్థిని బంగారు పతకంతో సత్కరించబడటం మాకు గౌరవం, ప్రేరణ అని అన్నారు.ఇక అవార్డు గెల్చుకున్న ఎం.ఎస్. చిన్ని మాట్లాడుతూ.. ఈ బంగారు పతకం అందుకోవడం నాకు గొప్ప గౌరవం. ఇది నా కృషికి మాత్రమే కాదు, విశ్వ విశ్వనిలో నాకు అందిన మార్గదర్శకత్వం. అలాగే ప్రోత్సాహానికి గుర్తింపుగా భావిస్తున్నాను. నా విజయాన్ని నా గురువులకు, సంస్థకు అంకితం చేస్తున్నానని అన్నారు. ఈ గౌరవం ఉస్మానియా యూనివర్సిటీ యొక్క శతాబ్దకాల విద్యా ప్రాముఖ్యతను, ప్రొఫెసర్ మూర్తి వారసత్వాన్ని, విశ్వ విశ్వని సంస్థలు భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడంలో చేస్తున్న కృషిని ప్రతిబింబిస్తోంది.విశ్వ విశ్వని ఇన్స్టిట్యూషన్స్ గురించి చూసినట్లయితే.. ప్రొఫెసర్ ఎస్. ఎస్. మూర్తి శిష్యులు స్థాపించిన విశ్వ విశ్వని ఇన్స్టిట్యూషన్స్, హైదరాబాద్ లో నిర్వహణ, సాంకేతిక విద్యతో పాటు అనుబంధ రంగాల్లో నాణ్యమైన ఉన్నత విద్య అందించడంలో అగ్రగామిగా నిలుస్తున్నాయి. మార్గదర్శకత్వం, నూతన ఆవిష్కరణలు మరియు విద్యా ప్రాముఖ్యతను పునాదులుగా చేసుకొని, విశ్వ విశ్వని గ్లోబల్ దృక్పథం కలిగిన, నైతిక విలువలకు కట్టుబడి ఉన్న నాయకులను తీర్చిదిద్దుతోంది.

# కొంపముంచిన అత్యాశ..



**భువనగిరి ,ఫ్లాష్ ఇండియా :** నేషనల్ హైవే అథారిటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అరెస్ట్ అయ్యారు. రూ.60 వేలు లంచం తీసుకుంటూ బుధవారం సీబీఐ అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే.. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ టోల్ ప్లాజా పక్కన ఉన్న ఓ వ్యక్తి రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా హైవే పక్కన రెస్టారెంట్ నిర్వహిస్తున్నారని మూయించేస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో భయాందోళన గురైన యజమాని లంచం ఇవ్వడానికి రెడీ అయ్యాడు. బుధవారం మధ్యాహ్నం హోటల్ యజమాని నుంచి దుర్గాప్రసాద్ రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అనంతరం కేసు నమోదు చేశారు. దుర్గాప్రసాద్ కు చెందిన ఇళ్లు, ఆఫీసుల్లో తనిఖీలు చేపట్టారు.

# మద్యం షాపుల టెండర్లకు నోటిఫికేషన్ విడుదల

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ఆశావాహులకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. 2025-2027 సంవత్సరానికి గాను రాష్ట్ర వ్యాప్తంగా మద్యం షాపుల టెండర్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఇవాళ ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. లిక్కర్ షాపు కోసం కనీస దరఖాస్తు రుసుము రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచారు. ఫిక్స్ డ్ షాప్ ఎక్సైజ్ టాక్స్ ఆధారంగా లాటరీ ద్వారా ఆశావహులకు షాపులను కేటాయించనున్నారు. లైసెన్స్ కాలం 01.12.2025 నుంచి 30.11.2027 వరకు నిర్ణయించారు. ఈసారి మద్యం షాపు కేటాయింపుల్లో గౌడ సామాజికవర్గానికి 15 శాతం, ఎస్సీ సామాజికవర్గానికి 10 శాతం, ఎస్టీ సామాజికవర్గానికి 5 శాతం షాపులను కేటాయించనున్నారు. భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు దరఖాస్తు చేయడానికి అనుమతించారు. అదేవిధంగా ఒకే దరఖాస్తుదారుడు ఒక లిక్కర్ షాపునకు ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తులు దాఖలు చేయవచ్చు.

**6 శ్లాబ్ లలో లైసెన్స్ ల జారీ ఇలా..**

మొత్తం 6 శ్లాబ్ లలో ఎక్సైజ్ శాఖ లైసెన్స్ లను జారీ చేయనుంది. 2011 జనాభా లెక్క ప్రకారం 5 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో సంవత్సరానికి ఎక్సైజ్ ట్యాక్స్ రూ.50 లక్షలు, 5 వేల నుంచి 50 వేలు జనాభా ఉన్న పాంతాల్లో రూ.55 లక్షలు, 50 వేల నుంచి 1 లక్ష జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.60 లక్షలు, 1 లక్ష నుంచి 5 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షలు, 5 లక్షల నుంచి 20 లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షలు, ఇక 20 లక్షలపైన జనాభా ఉన్న ప్రాంతాల్లో సంవత్సరానికి ఎక్సైజ్ ఫీజు రూ.కోటి పది లక్షలుగా నిర్ణయించారు.అయితే, లాటరీ ద్వారా లిక్కర్ షాపులను పొందిన వారు ప్రభుత్వానికి చెల్లించాల్సిన వార్షిక ఫీజును ప్రతి ఏటా ఆరు సమాన వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. 25 నెలల లైసెన్స్ కాలానికి గాను 1/4వ వంతు అంటే 25 శాతం సమానమైన బ్యాంక్ గ్యారెంటీ ప్రభుత్వానికి సమర్పించాలి. GHMC, నగర పంచాయతీల పరిధిలో మద్యం షాపులను ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10.00 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచేందుకు అనుమతిస్తారు.

# ఉగ్రరూపం దాల్చిన గోదావరి..

**ఒకటవ ప్రమాద హెచ్చరిక జారీ!**



**భద్రాచలం,ఫ్లాష్ ఇండియా :** గోదావరి నదిలో నీటి మట్టం పెరుగుతుండడంతో భద్రాచలంలో 1వ హెచ్చరిక అమల్లోకి వచ్చింది. ఉదయం 08.15 గంటలకు నీటి మట్టం 43.00 అడుగులకు చేరి ప్రవాహం 9,32,288 క్యూసెక్కుల వద్ద నమోదయిందని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటన విడుదల చేసి జిల్లా కలెక్టర్ తో పాటు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ప్రజల ప్రాణరక్షణలో ఎలాంటి లోటు చోటుచేసుకోకూడదని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నది పరివాహక గ్రామాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందుగానే సమాచారం అందించడంతో పాటు అవసరమైతే వారిని సురక్షిత ప్రదేశాలకు తరలించే చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అత్యవసర పరిస్థితులలో సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలని, గ్రామ స్థాయిలో పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో పరిస్థితిని నిమిషానికోసారి పరిశీలించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబడదు అని మంత్రి స్పష్టం చేశారు. ప్రతి ప్రాణం మాకు అమూల్యం.. ప్రజల రక్షణ మా తొలి కర్తవ్యం. ఎవరూ ఆందోళన చెందవద్దు. ప్రభుత్వం మీతో ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తన ప్రకటనలో స్పష్టం చేశారు.

**ప్రజలకు సూచనలు:**

వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.నది తీర ప్రాంతాలకు వెళ్లరాదు.వరద నీటిలో వాహన ప్రయాణాలు చేయరాదు.పిల్లలు, వృద్ధులను జాగ్రత్తగా ఉంచాలి.అధికారులు జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలి.అవసరమైతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలి.

# భారీగా పెరిగిన టమాటా ధర..

- తెలుగు రాష్ట్రాల్లో భారీగా పెరిగిన టమాటా ధరలు..
- రిటైల్ మార్కెట్‌లో 100కు చేరువలో కిలో టమాటా..
- మార్కెట్లో డిమాండ్‌కు సరిపడా రాని టమాటా..
- ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న టమాటా పంట..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలుగు రాష్ట్రాల్లో టమోటా ధరలు భారీగా పెరుగుతున్నాయి. వారం క్రితం వరకు కిలో 20 నుంచి 30 రూపాయలు పలికిన కిలో టమాటా ధర ఇప్పుడు భారీగా పెరిగింది. గత 15 రోజుల్లో టమాటా ధర డబుల్ అయిపోయింది. ప్రస్తుతం హోల్ సేల్ మార్కెట్ లో కిలో టమాటా 60 నుంచి 70 రూపాయలు పలుకుతుంది. కాగా, డిమాండ్ కు సరిపడ టమాటా రాకపోవడమే ఇందుకు కారణమని కూరగాయల వ్యాపారులు చెబుతున్నారు. ఇక, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు టమాటా పంటలు దెబ్బతిన్నాయని.. దీంతో ధరలు అమాంతం పెరిగాయని పేర్కొంటున్నారు.అయితే, గత 10 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల దెబ్బకు టమాట పంట నాశనం అయింది. దీంతో హైదరాబాద్ సహా తెలంగాణలోని పలు జిల్లాలు, రాయలసీమ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి కూడా వచ్చే టమాటా పంట దిగుబడి కూడా ఆగిపోవడంతో ధరలు పెరిగినట్లు కూరగాయల వ్యాపారులు పేర్కొంటున్నారు. కాగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ, విశాఖపట్నం లాంటి నగరాల్లో కేజీ టామాట ధర రూ. 50 నుంచి 60 వరకు పలుకుతుంది. ఇక, మిగతా జిల్లాల్లో 35- 45 వరకు పలుకుతుంది. మరికొన్ని రోజుల పాటు అతి భారీ వర్షాలు, వరదలతో టామాట పంట తీవ్రంగా దెబ్బ తింది. మార్కెట్లకు సరఫరా గణనీయంగా తగ్గిపోవడంతో రేట్లు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

## పోలీస్ అధికారులపై దాడికి



**కోరుట్ల,ఫ్లాష్ ఇండియా :** విధులు నిర్వహిస్తున్న బ్లూ కోల్ట్ పోలీస్ అధికారులపై దాడికి పాల్పడిన ఘటన కోరుట్ల పట్టణంలో చోటుచేసుకుంది. కోరుట్ల ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని మంగళవారం రాత్రి తాళ్ల చెరువు సమీపంలో గొడవలు జరుగుతుందని వంద నంబర్ కు కాల్ రాగా.. సమాచారం అందుకున్న హెడ్ కానిస్టేబుల్ జావీద్, బ్లూ కోల్ట్ పిసి గంగాధర్ లు ఘటన వద్దకు చేరుకుని గొడవను సద్దుమనిగే క్రమంలో కొందరు యువకులు పోలీస్ లపై వాగ్వాదానికి దిగి తోపులటకు పాల్పడే క్రమంలో గంగాధర్, జహీద్ లకు గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి యువకులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

## బాబానాయక్‌కు 2025 పద్మశ్రీ చక్ర అవార్డు




**గరిడేపల్లి,ఫ్లాష్ ఇండియా :** మండల పరిధిలో ఉన్న గారకుంట తండ గ్రామానికి చెందిన సామాజికవేత్త ప్రముఖ ప్రఖ్యాత బ్లడ్ డోనర్ గుగులోతు బాబానాయక్ పద్మ చక్ర శ్రీ అవార్డు హైదరాబాద్ రవీంద్ర భారతిలో మాజీ మంత్రివర్యులు సినీ ప్రముఖులు బాబు మోహన్, తెలంగాణ తొలి శాసనసభ మాజీ స్పీకర్ మధుసూదనా చారి చేతుల మీదగా అవార్డును స్వీకరించారు. గుగులోతు బాబా నాయక్ గార కుంట తండా గ్రామానికి చెందిన గుగులోతు బాలు నాయక్, వాలి దంపతుల చిన్న కుమారుడు హైదరాబాదులో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తూ కొండాపూర్ లో ఉన్నటువంటి పోలీస్ బెటాలియన్ లో విధులు నిర్వహిస్తున్నారు.ఆ ప్రాంతంలో ఎవరికైనా బ్లడ్ ,ప్లేట్లెట్స్ అవసరం ఉంటే ఆపదలో నేనున్నానని ధైర్యంతో ముందుకు సాగే వ్యక్తి అంతేకాకుండా ఒకే సంవత్సరంలో తనదైన శైలిలో 28 సార్లు బ్లడ్ డొనేట్ చేసి, వివిధ వాట్సాప్ గ్రూపుల ద్వారా 1000 మంది ద్వారా బ్లడ్ ఇప్పిచ్చిన వ్యక్తి బాబా నాయక్. అతని సేవా కార్యక్రమాలను గుర్తించి తెలంగాణ భాషా సాంస్కృతిక సారథ్యంలో నిర్వహించిన అవార్డు కార్యక్రమంలో అతనిని ప్రత్యేకంగా సన్మానించి అవార్డు బహుక రించారు. ఈ సందర్భంగా బాబా నాయక్ మాట్లాడుతూ.. అవార్డు నాకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్ లో ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు చేసి నేను పుట్టిన గ్రామానికి, నా తల్లిదండ్రులకు, నా స్నేహితులకు మంచి పేరు తెస్తానని అన్నారు.

## మహిళకు రిమాండ్ విధించిన కోర్టు..



**మణుగూరు,ఫ్లాష్ ఇండియా :** ఏడూళ్ల బయ్యారం క్రాస్ రోడ్డులో బేకరీ షాప్ నడుపుతున్న దుగినేపల్లి గ్రామానికి చెందిన శనగల పవన్ కుమార్ భార్య బోగటి రమాదేవికి కొత్తగూడెం న్యాయస్థానం రిమాండ్ విధించింది. గత ఏడాది భార్యాభర్తలు అక్రమంగా నాటుసారా అమ్ముతూ ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేశారు. దీనిపై ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకొని కోర్టు దృష్టికి తీసుకువెళ్ళి కేసు నమోదు చేశారు. నిన్న పోలీసులు అరెస్టు చేసి వీరిని న్యాయస్థానం ముందు హాజరు పరిచారు. వివరాలు క్షుణ్ణంగా పరిశీలించిన న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో భద్రాచలం సబ్ జైలుకు బోగటి రమాదేవిని తరలించారు. ఈ కేసులో ఏ -1గా శనగల పవన్, ఎ-2 గా బోగటి రమాదేవి ఉన్నారు.

# సెలెక్షన్ గ్రేడ్ కమిషనర్లకు అన్యాయం

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** పురపాలక శాఖలో కేడర్ కిరికిరి నడుస్తోంది. ఒక పక్క జీహెచ్ఎంసీలో అదనపు కమిషనర్లను కుదించగా, మరో పక్క పురపాలకశాఖలోని మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన కమిషనర్ పోస్టుల్లో ఐఏఎస్ అధికారులు, కింది స్థాయి కేడర్ తిష్టవేశారు. జీహెచ్ఎంసీలో ఉండనీయడంలేదు.. సీడీఎంఏలో పోస్టింగ్ ఇవ్వడంలేదు. దీంతోపాటు కొంత మంది సెలెక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లకు సైతం కేడర్ కు తగ్గ పోస్టు ఇవ్వడంలేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే ఔటర్ రింగ్ రోడ్డు(ఓఆర్ఆర్) పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించిన పోస్టుల భర్తీలో రాజకీయ జోక్యంతోపాటు ఓ అసోసియేషన్ కీలకనేత ప్రభావం ఉన్నదని ఆరోపణలున్నాయి. ఫలితంగానే తక్కువ కేడర్ కు ప్రధాన పోస్టులు ఇస్తున్నారని విమర్శలొస్తున్నాయి.పురపాలకశాఖలో 39 సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ పోస్టులు మంజూరయ్యాయి. వీటిలో ప్రస్తుతం 36 మంది పనిచేస్తున్నారు. మరో మూడు ఖాళీగా ఉన్నాయి. త్వరలోనే ఈ 3 పోస్టులను సైతం ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయడానికి సర్కార్ కసరత్తు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పోస్టులను జీహెచ్ఎంసీ, పురపాలకశాఖ కమిషనరేట్ లోని మున్సిపల్ కార్పొరేషన్లు, హెడ్ ఆఫీసులో జాయింట్ డైరెక్టర్ పోస్టుల ఆధారంగానే ప్రభుత్వం మంజూరు చేసిందని అధికారులు చెబుతున్నారు.జీహెచ్ఎంసీలో ప్రసాదరావు కమిటీ సిఫార్సుల ప్రకారం ఆరుగురు అడిషనల్ కమిషనర్లు, ఆరుగురు జోనల్ కమిషనర్లు ఉండాలని ఓ సీనియర్ అధికారి చెబుతున్నారు. వీరిలో నలుగురు అడిషనల్ డైరెక్టర్లు, ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఉండాలని స్పష్టంగా పేర్కొన్నారు. కానీ జీహెచ్ఎంసీలో ప్రస్తుతం ముగ్గురు మాత్రమే అడిషనల్ డైరెక్టర్లు ఉన్నారు. ఇద్దరు జోనల్ కమిషనర్లుగాను, ఒకరు అడిషనల్ కమిషనర్ గాను ఉన్నారు. మిగిలిన అడిషనల్ కమిషనర్లంతా సెలెక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ కేడర్ వారే ఉన్నారు. అయితే ఆర్వీ కర్ణన్ జీహెచ్ఎంసీ కమిషనర్ గా వచ్చిన తర్వాత ముగ్గురిని సీడీఎంఏకు సరెండర్ చేశారు. మరో ఇద్దరిని జాయింట్ కమిషనర్ గా పోస్టింగ్ ఇవ్వడంతో వారు దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీంతోపాటు చాలా మంది సెలెక్షన్ మున్సిపల్ గ్రేడ్ కమిషనర్లకు డిప్యూటీ కమిషనర్లుగా పోస్టింగ్ ఇచ్చారు. అయితే పురపాలకశాఖలోనే మొదటి సారిగా కర్ణన్ సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని, ఫలితంగానే కేడర్ సమస్యలు వస్తున్నాయని పలువురు సీనియర్ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.పురపాలకశాఖ కమిషనరేట్ హెడ్ ఆఫీసుతోపాటు, మున్సిపల్ కార్పొరేషన్లు, జీహెచ్ఎంసీలో కీలక పోస్టులను సెలెక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లు ఆశిస్తున్నారు. జీహెచ్ఎంసీలో అయితే గతంలో అడిషనల్ కమిషనర్ పోస్టు ఆశించేవారు. వాటి సంఖ్య కుదించడం తోపాటు ప్రస్తుతం డిప్యూటీ కమిషనర్ పోస్టు ఇచ్చినా ఫర్వాలేదంటున్నారు. వీటితోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 16 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో జీహెచ్ఎంసీ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మినహాయిస్తే మరో 14 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నాయి. వీటిలో రామగుండం, కరీంనగర్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లలో ఐఏఎస్ అధికారులు, నిజామాబాద్ లో జిల్లా పరిషత్ సీఈఓ ఉన్నారు. మిగిలిన పదింటిలో మీర్ పేట్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్లలో స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లు, బడంగ్ పేట్ లో సెక్షన్ ఆఫీసర్ కేడర్ ఆఫీసర్ ఉన్నారు. ఫీర్జాదిగుడలో గ్రేడ్-1, మహబూబ్ నగర్, కొత్తగూడెం, నిజాంపేట్, జవహర్ నగర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్లలో గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్లు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లో గ్రేడ్-3 మున్సిపల్ కమిషనర్ ఉన్నారు.త్వరలోనే పలువురికి సెలెక్షన్ గ్రేడ్, స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా ప్రమోషన్ రానున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు జీహెచ్ఎంసీ పరిధిలో పలు సర్కిళ్లకు స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లను డీసీలుగా నియమించే అవకాశముంది. దీంతోపాటు తమకు కేడర్ కు తగిన పోస్టింగ్ ఇవ్వాలని పలువురు సెలెక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లు కోరుతున్నారు.పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో ఏడుగురు అధికారుల ప్రమోషన్లకు ఆర్థిక శాఖ మంగళవారం క్లియరెన్స్ ఇస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న కె.శ్రీనివాస్, కె.రాజులకు సెక్షన్ ఆఫీసర్లుగా ప్రమోషన్ ఇచ్చారు. దీంతోపాటు సెక్షన్ ఆఫీసర్లుగా పనిచేస్తున్న పి.జ్యోతి, బి.సునీత, ఎన్.మంగమ్మ, కె.రంజిత్ కుమార్, ఎం.ముత్తారెడ్డిలకు అసిస్టెంట్ సెక్రెటరీలుగా ప్రమోషన్ ఇచ్చారు.

# ఆన్ లైన్ లో కార్ల విక్రయాలు



**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** ఆన్లైన్లో కార్లను విక్రయించే ముఠా గుట్టును జిల్లా పోలీసులు రట్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడించారు. ఫేక్ ఐడి కార్డులు, ఫేక్ ఆర్సీలతో కార్లను అమ్ముతూ తిరిగి వాటిని చోరీ చేస్తున్న ముఠాను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఫేస్ బుక్ అప్లికేషన్ ద్వారా కారు కొనుక్కున్న వ్యక్తుల కారును రెండు రోజుల తర్వాత కారు నాది.. మీరెలా కొనుక్కుంటారు అని బెదిరిస్తూ కారును తీసుకెళ్తున్న కేసు మాచారెడ్డి పోలీస్ స్టేషన్లో జులై 1 న నమోదు కాగా విచారణ ప్రారంభించడం జరిగిందన్నారు. కారు సెల్ఫ్ డ్రైవింగ్ కోసమని అద్దెకు తీసుకుని ఏడుగురు ముఠా సభ్యులు దానికి ఫేక్ నంబర్ ప్లేట్, ఫేక్ ఆర్సీ తయారు చేస్తారని తెలిపారు. ఆన్లైన్ లో ఎంప్టీ చిప్స్ కొనుగోలు చేసి వాటికి ప్రింట్ తయారు చేసుకుని ఫేక్ ఐడి కార్డులు తయారు చేస్తారన్నారు.ఐడి ద్వారా ఫేక్ ఆర్సీ తయారు చేసి ఆ కారును అమ్మేస్తారని, అదే కారుకు ఆన్లైన్ లో కొనుగోలు చేసిన జిపిఎస్ ట్రాకర్ అమార్చుతారని తెలిపారు. రెండు రోజుల తర్వాత జిపిఎస్ ద్వారా కార్డు అడ్రస్ తెలుసుకుని మరొక వ్యక్తి ఆ కారు యజమానిగా వెళ్లి ఫేక్ ఆర్సీ చూపించి ఇది మా కారు మీరెలా కొంటారని, పోలీస్ కేసులు చేస్తామని బెదిరించి, గొడవ పడి డూప్లికేట్ కీ ద్వారా తిరిగి కారును తీసుకెళ్తారని తెలిపారు. తిరిగి యధావిధిగా ఎక్కడైతే కారును అద్దెకు తీసుకున్నారో మళ్ళీ వారికి కారును అప్పగిస్తారన్నారు. ఈ గ్యాంగ్ కోసం పోలీసులు వెతుకుతున్నారని తెలుసుకుని గత 10 రోజులుగా షేర్ లింగంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తలదాచుకున్న ముఠాలో ఆరుగురిని అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. వీరిపై జిల్లాలో ఒకే కేసు నమోదయిందని, ఇతర ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలకు పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు.అరెస్టైన వారిలో రంగారెడ్డి జిల్లా శేరి లింగంపల్లికి చెందిన మహమ్మద్ ఇయాజ్, వికారాబాద్ అలంపల్లికి చెందిన మహమ్మద్ జాహిద్ అలీ, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంకు చెందిన పృథ్వి జగదీష్, వరంగల్ జిల్లా కొత్తవాడకు చెందిన రాచర్ల శివకృష్ణ, రంగారెడ్డి జిల్లా శేరి లింగంపల్లికి చెందిన కర్ణకోట సాకేత్, సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంకు చెందిన వేములవాడ వివేక్ ఉన్నారు. అలీ అనే వ్యక్తి పరారీలో ఉన్నట్టు తెలిపారు. అరెస్టైన వారి నుంచి ఇన్నోవా, ఎర్టిగా, బాలెనో కార్లు, 15 మొబైల్ ఫోన్, కారు జిపిఎస్, ల్యాప్ టాప్, 10 మైక్రో సిమ్ కార్డులు, ఎంప్టీ చిప్ కార్డ్స్, ఫోర్జరీ చేసిన ఆర్సీలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.సిమ్ కార్డులకు కూడా రిజిస్ట్రేషన్ లేవని, ఈ సిమ్ కార్డులు ఎక్కడినుంచి వచ్చాయి, ఎవరు ఇస్తున్నారు అనేది తెలియాల్సి ఉందన్నారు. వీరికి తెర వెనుక సహకరిస్తుంది ఎవరు.. వీరి ముఠా ఇంకెవరైన ఉన్నారా అనే దానిపై కస్టడీకి తీసుకుని విచారణ చేస్తామన్నారు. అరెస్టైన వారిపై గతంలో శంకర్ పల్లి, మంచాల, అంబార్ పేట, రామచంద్రాపురం, చందానగర్, మియాపూర్, అత్తాపూర్ పోలీస్ స్టేషన్లలో 8 కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. ముఠా అరెస్టులో చురుగ్గా పని చేసిన రూరల్ సీఐ రామన్, మాచారెడ్డి ఎస్సై అనిల్, కానిస్టేబుల్స్ సుభాష్ రెడ్డి, శ్రీకాంత్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ చైతన్య రెడ్డి, సీఐ రామన్, ఎస్సై అనిల్ పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని రాజీవ్ కి ఘన నివాళులు

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని,భారత రత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం రాజీవ్ చౌక్ నందు రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ 1986 లో జాతీయ విద్యా విధానాన్ని దేశమంతా విస్తరించే ప్రయత్నం చేస్తూ జవహర్ నవోదయా విద్యాలయాలను స్థాపించిన గొప్ప నాయకులు వారని కొనియాడారు.దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీని ఎంతగానో ప్రోత్సహించారు.అలాగే సూపర్ కంప్యూటర్స్ రూపకల్పనకు ప్రోత్సాహం అందించిన నాయకత్వం వారిదన్నారు.వారిని స్మరించు కుంటూ వారి బాటలో ప్రతిఒక్కరం నడుస్తూ ముందుకు వెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.




# సేవాభావంతో ఉన్నతమైన సమాజాన్ని నిర్మించవచ్చు

**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ పట్టణంలోని కే.ఎన్.ఎం. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్.సి.సి విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ వారి ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో బ్లడ్ గ్రూప్ పరీక్షల నిర్ధారణ ముఖ్య అవసరాన్ని గురించి కళాశాల ఎన్.సి.సి. సీ.టి.ఓ.డాక్టర్ గుమ్మడి నరేష్ మాట్లాడుతూ ఎన్.సి.సి. విద్యార్థులు అనేక సేవా కార్యక్రమాల్లో జాతీయ కార్యక్రమాల్లోను పాల్గొంటారు కాబట్టి రక్తం అవసరమైన వారికి దానం చేయడానికి,తమకే అవసరం పడినపుడు స్వీకరించడానికి ప్రతి వ్యక్తి తప్పనిసరిగా తమ రక్త పరీక్ష నిర్ధారణ చేసుకోవలసి ఉంటుందని తెలియజేశారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ భీమార్జునరెడ్డి లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ వారి సేవా గుణాన్ని కొనియాడారు. ఎన్.సి.సి. విద్యార్థులు సమాజంలో సేవా భావాన్ని కలిగి ఉన్నట్లయితే ఉన్నతమైన సమాజాన్ని నిర్మించడం సులభం అవుతుందని అభిప్రాయపడ్డారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ వారు కళాశాలలో బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించడానికి కృషిచేసిన కళాశాల ఉద్యోగి శేఖర్ రెడ్డి ని కళాశాల సిబ్బంది అభినందించారు.లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ ప్రెసిడెంట్ బి.ఎం.నాయుడు కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ కళాశాలలోని విద్యార్థులకు ఏ అవసరంలోనైనా తమ సంస్థ స్వచ్ఛందంగా సేవ అందిస్తుందని,బస్ పాసులు లేని విద్యార్థులకు బస్ పాస్ సౌకర్యాన్ని కూడా అందిస్తామని విద్యార్థులకు హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ కార్యదర్శి కూటాల రాంబాబు,ఎనిగండ్ల లింగయ్య ,పందిరి వేణు మరియు కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## కాలేజీ యాజమాన్యం దురుసు ప్రవర్తన

**గండిపేట,ఫ్లాష్ ఇండియా :** విద్యార్థులు కాలేజీకి ఆలస్యంగా వచ్చారని యాజమాన్యం వారిని బయట నిలబెట్టింది. ఈ సంఘటన గండిపేట మండల పరిధిలోని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ పరిధిలో ప్రధాన రహదారి పక్కన ఉన్న వ్యాలీ ఓక్ జూనియర్ కళాశాలలో బుధవారం ఉదయం జరిగింది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం వ్యాలీ జూనియర్ కళాశాలలో సుమారు వెయ్యి మందికి పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరంతా ప్రతిరోజు వివిధ ప్రాంతాల నుంచి కళాశాలకు రాకపోకలు సాగిస్తున్నారు.ఇదిలా ఉండగా, బుధవారం ఉదయం కాలేజీ 9 గంటలకు ప్రారంభం అయింది. అయితే, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కొందరు విద్యార్థులు కళాశాలకు ఆలస్యంగా చేరుకున్నారు. దీంతో వారి పై కళాశాల యాజమాన్యం తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిని సుమారు గంట సమయం పాటు కళాశాల బయట నిలబెట్టింది. దీంతో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ విషయాన్ని తమ తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థులను బయట నిలబెట్టారు అనే విషయమై వివరణ కోరేందుకు కళాశాల ప్రిన్సిపల్ ను ఫోన్లో సంప్రదించే యత్నం చేయగా.. స్పందించలేదు.

**ఫీజులు కట్టలేదని వేధింపులు..**

ఇటీవల ఇదే కాలేజి యాజమాన్యం విద్యార్థులు ఫీజులు కట్టలేదని వారిని కళాశాల నుంచి వెళ్లగొట్టారు. కొంత సమయం ఇవ్వాలని వేడుకున్నా ఫలితం లేకుండా పోయింది. దురుసుగా ప్రవర్తిస్తున్న వ్యాలీ ఓక్ యాజమాన్యం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# బాచుపల్లిలో విషాదం..



**కుత్బుల్లాపూర్ ,ఫ్లాష్ ఇండియా :** భార్యాభర్తల కలహాలకు చిన్నారులు బలిపశువులు అయ్యారు. భర్తతో గొడవ పడి తన ఇద్దరు చిన్నారులను నీటి సంపులో వేసి తాను ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పిట్లం కు చెందిన లక్ష్మణ్, రత్నమ్మ ఇద్దరూ భార్యభర్తలు. ఉపాధి కోసం నగరానికి వలస వచ్చి బాచుపల్లిలో ఉంటూ భర్త లక్ష్మణ్ ఇటుకల లారీలో లేబర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే వీరికి నలుగురు పిల్లలు కాగా ఇద్దరు వీరి స్వంత ఊరు కామారెడ్డి జిల్లా పిట్లం మండలం ధర్మారం విలేజ్ లోగల భర్త సొంత విలేజ్ లో ఇద్దరు సంతానం జగన్(08), పవన్(07) ఉంటున్నారు. మిగతా ఇద్దరూ అరుణ్ (03), సుభాన్(08) నెలలు బాచుపల్లి లోని వీరి వద్దనే ఉంటున్నారు. అయితే భార్య భర్తల మధ్య ఫ్యామిలీ ప్లానింగ్ విషయంలో గత కొంతకాలం నుంచి గొడవలు జరుగుతున్నాయి.ఈ క్రమంలో గురువారం తెల్లవారు జామున భర్తతో ఫ్యామిలీ ప్లానింగ్ విషయంలో, ఆర్థిక సమస్యలపై గొడవ అనంతరం మనస్థాపం చెంది భార్య రత్నమ్మ తన ఇద్దరు పిల్లలు అరుణ్ (03), సుభాన్ (08 నెలలు ) ను తాను కిరాయికి ఉంటున్న నీటి సంపులో పడేసి, తాను దూకి ఆత్మహత్యకు ప్రయత్నించింది. అయితే వారు నివాసం ఉంటున్న ఇంట్లో పక్కన ఉన్న ఓ వ్యక్తి వాష్ రూమ్ కోసం బయటకు రాగా నీటి సంపులో సౌండ్ రావడంతో చూడగా సంపు నీళ్లలో పడి రత్నమ్మ కొట్టుమిట్టాడుతుంది. చుట్టు పక్కల వారిని నిద్ర లేపి రత్నమ్మను బయటకు లాగారు. ఆపై మిగతా ఇద్దరు చిన్నారులను కూడా బయటకు తీయగా వారు అప్పటికే చనిపోయారు. రత్నమ్మ ను చికిత్స కోసం గాంధీ హాస్పిటల్ కు చేర్చి చికిత్స అందిస్తున్నారు. అలాగే చనిపోయిన మిగతా ఇద్దరు చిన్నారులను పోస్ట్ మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రాజెక్టులకు పోటెత్తుతున్న వరద..

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణతో పాటు ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ వరదనీటితో నిండుకుండల్లా మారాయి. నాగార్జునసాగర్, శ్రీరామ్ సాగర్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులతో పాటు.. కాళేశ్వరం త్రివేణి సంగమం, భద్రాచలం వద్ద గోదావరికి వరద గంటగంటకూ పెరుగుతోంది. దీంతో అధికారులు ఆయా ప్రాజెక్టుల గేట్లను ఎత్తి వరదనీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ కు వరద ప్రవాహం భారీగా రావడంతో 26 క్రస్ట్ గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 294.55 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 10 లక్షల క్యూసెక్కులు ఇన్ ఫ్లో వస్తుండగా.. 4.06 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.మరోవైపు శ్రీరామ సాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద వస్తుండటంతో 39 గేట్లను ఎత్తి 4.03 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదలుతున్నారు. ఇన్ ఫ్లో 2.75 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు కాగా.. నిన్న సాయంత్రానికి 1089 అడుగుల వరకూ వరదనీరు చేరింది. ఎస్సారెస్పీ నుంచి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరదనీరు పోటెత్తడంతో 40 గేట్లను ఎత్తి 5,17,250 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోకి 6,65,170 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. అదేస్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. వరదనీటి రాకతో సమ్మక్కసాగర్ బ్యారేజీ జలకళను సంతరించుకుంది. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 83 మీటర్లు కాగా.. గత రాత్రి వరకూ 82.60 మీటర్లకు చేరినట్లు అధికారులు తెలిపారు.భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం పెరుగుతుండటంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నదిలో స్నానాలు ఆచరించే భక్తులను ఒడ్డునే ఉండాలని సూచించారు. ప్రస్తుతం నది నీటిమట్టం 43 అడుగులకు చేరుకుంది.

# మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ..

- రాష్ట్ర కమిటీ సభ్యురాలు సునీత పోలీసుల వలలో
- మరో మావోయిస్టు నేత చెన్నూరి హరీష్ లొంగిపోవడం
- తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు గట్టి ఎదురుదెబ్బ
- భవిష్యత్ వ్యూహాలకు పెద్ద సవాలుగా పరిణామాలు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర పోలీసులు మావోయిస్టులకు గట్టి షాక్ ఇచ్చారు. మావోయిస్టు ఉద్యమంలో కీలక స్థానంలో ఉన్న ఇద్దరు ముఖ్య వ్యక్తులు తాజాగా పోలీసుల వలలో చిక్కారు. అందులో రాష్ట్ర కమిటీ సభ్యురాలు సునీత ఒకరు. ఆమె మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ భార్యగా గుర్తించారు. సుదీర్ఘకాలంగా భూగర్భంలో ఉంటూ పార్టీ కార్యక్రమాలను నడిపిస్తున్న సునీత అరెస్టు మావోయిస్టు నేతృత్వానికి పెద్ద దెబ్బగా పోలీసులు అంచనా వేస్తున్నారు. అదేవిధంగా మరో మావోయిస్టు నాయకుడు చెన్నూరి హరీష్ కూడా స్వచ్ఛందంగా లొంగిపోయాడు. మావోయిస్టు కదలికలు ఎక్కువగా ఉన్న తెలంగాణ-ఛత్తీస్ గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో ఈ పరిణామం పెద్ద ఎత్తున చర్చనీయాంశంగా మారింది. ఆయన లొంగిపోవడమే కాకుండా, ఇప్పటి వరకు మావోయిస్టుల కార్యకలాపాలపై తనకు తెలిసిన విషయాలను అధికారులకు వెల్లడిస్తున్నట్లు సమాచారం.ఇక ఈ తాజా పరిణామాలు మావోయిస్టుల భవిష్యత్ వ్యూహాలకు గట్టి ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ, ఛత్తీస్ గఢ్ లో మావోయిస్టు బలగాలను సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, అగ్రనేతల అరెస్టులు, లొంగిపోవడం వారిలో ఆందోళనను పెంచుతున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్ర పోలీసులు ఇప్పటికే మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లను మరింత వేగవంతం చేశారు. అడవీ ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్లను కట్టుదిట్టం చేస్తూ, భూగర్భంలో దాక్కున్న ఇతర నేతలపై దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో సునీత అరెస్టు, హరీష్ లొంగిపోవడం మావోయిస్టు కదలికలను బలహీనపరిచే అవకాశం ఉందని అధికారులు విశ్వసిస్తున్నారు.

# ఆడడం తప్ప ఇంకేం చేయగలం?

## 165 స్ట్రైక్‌రేట్ ఉన్నా భారత జట్టులో లేదు..



ఆసియా కప్ 2025 కోసం 15 మందితో కూడిన భారత జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. జట్టులో చోటు ఆశించిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కు నిరాశే ఎదురైంది. స్టాండ్ బైలో అతడికి బీసీసీఐ సెలక్షన్ కమిటీ అవకాశం కల్పించింది. జైస్వాల్ కు భారత జట్టులో అవకాశం రాకపోవడంపై సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. 2024 టీ20 ప్రపంచకప్ లో బ్యాకప్ ఓపెనర్ గా ఉన్న అతడికి ఆసియా కప్ లో చోటు దక్కలేదు. దీనిపై టీమిండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. 165 స్ట్రైక్ రేట్ ఉన్నా జైస్వాల్ కు భారత జట్టులో చోటు లేకపోవడం సరికాదని బీసీసీఐపై అసహనం వ్యక్తం చేశాడు.రవి చంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్ లో మాట్లాడుతూ... 'యశస్వి జైస్వాల్ కు టెస్ట్ క్రికెట్ లో అవకాశం వచ్చింది. అతడు దానిని రెండు చేతులా అందిపుచ్చుకున్నాడు. ఇటీవలి కాలంలో భారత్ తరపున అరంగేట్రం చేసిన అత్యంత విజయవంతమైన టెస్ట్ బ్యాట్స్ మన్ యశస్వి మాత్రమే. అవకాశం ఇచ్చినపుడు ఏ ఫార్మాట్ లోనైనా రాణించాడు. అవకాశం వచ్చినపుడు రాణించడం తప్ప మరేం చేయగలరు?. యశస్వి రాణించినా ఇప్పుడు ఛాన్స్ రాలేదు. నాయకత్వం రేసులోనూ నిలిచిన యశస్వి.. ఇప్పుడు జట్టులోనే లేకపోవడం నన్ను షాక్ కు గురిచేసింది. టీ20 ఫార్మాట్ లో అతడి స్ట్రైక్ రేట్ 165. జట్టు కోసం ఆడే వారు చాలా తక్కువ. యశస్వి ఆలాంటి ఆటగాడి. అతడు జట్టులో ఉండాల్సింది' అని బీసీసీఐ సెలక్షన్ కమిటీపై ఆగ్రహం వ్యక్తం చేశాడు.

**భారత జట్టు:**

సూర్యకుమార్, గిల్, అభిషేక్, హార్దిక్, అక్షర్, బుమ్రా, జితేశ్ శర్మ, శివమ్ దూబె, అర్ష్ దీప్, సంజు శాంసన్, హర్షిత్ రాణా, తిలక్ వర్మ, రింకు సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్ దీప్ యాదవ్ .

స్టాండ్ బైలు: ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్.

# బెంచ్‌లో 'ఆ నలుగురు'..



ఆసియా కప్ 2025 యూఏఈలో సెప్టెంబర్ 9న ఆరంభం కానుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీ కోసం 15 మందితో కూడిన భారత జట్టును బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. దాంతో ఆసియా కప్ లో బరిలోకి దిగే జట్టుపై సస్పెన్స్ వీడింది. భారత జట్టుపై సస్పెన్స్ వీడినా.. ప్లేయింగ్ 11లో ఎవరుంటారనే ఉత్కంఠ మాత్రం కొనసాగుతోంది. బౌలింగ్ విషయంలో క్లారిటీ ఉన్నా.. బ్యాటింగ్ లైనప్ ఎలా ఉంటుందనేది మాత్రం ఆసక్తికరంగా మారింది. 15 మందిలో 11 మందికి అవకాశం వస్తుంది. మిగతా నలుగురు బెంచ్ లో ఉండాల్సిందే. తుది జట్టులో ఉండే అవకాశాలు ఎవరికి మెండుగా ఉన్నాయో ఓసారి చూద్దాం.ఓపెనింగ్ కాంబినేషన్ పై చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ హింట్ ఇచ్చాడు. సంజూ శాంసన్ రెగ్యులర్ ఓపెనర్ కాదని.. శుభ్ మన్ గిల్, యశస్వి జైస్వాల్ లేకపోవడంతోనే అవకాశం దక్కిందని చెప్పాడు. దాంతో అభిషేక్ శర్మతో కలిసి గిల్ ఓపెనర్ గా దిగడం ఖాయం అయింది. ఫస్ట్ డౌన్ లో తెలుగు ఆటగాడు తిలక్ వర్మ రెండు సెంచరీలు చేశాడు కాబట్టి ఆ ప్లేస్ ఫిక్స్. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాలుగో స్థానంలో, ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఐదో స్థానంలో బరిలోకి దిగుతారు. వికెట్ కీపర్ గా జితేష్ శర్మ కంటే సంజూ శాంసన్ ఆడే అవకాశాలే ఎక్కువ. సంజూ 6 లేదా 5వ స్థానంలో బ్యాటింగ్ చేయనున్నాడు. సంజూ 5లో ఆడితే.. హార్దిక్ 6లో వస్తాడు. రింకూ సింగ్ కు తుది జట్టులో చోటు కష్టమే.స్పిన్ ఆల్ రౌండర్ గా అక్షర్ పటేల్ ఆడడం పక్కా. అక్షర్ ఇటీవలి రోజుల్లో బాగా ఆడుతున్న విషయం తెలిసిందే. శివమ్ దూబెకు నిరాశ తప్పదు. స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి బరిలోకి దిగుతారు. దుబాయ్ పిచ్ లు స్పిన్ అనుకూలంగా కాబట్టి ఈ ఇద్దరు ఆడే అవకాశం ఉంది. ఒకవేళ అభిషేక్ శర్మ, అక్షర్ రూపంలో ఇద్దరు స్పిన్నర్లు ఉన్నారు కాబట్టి.. కుల్దీప్, చక్రవర్తిలో ఒకరికే అవకాశం దక్కినా ఆశ్చర్య పోనక్కర్లేదు. ఇదే జరిగితే ఫినిషర్ గా రింకూ సింగ్ ఆడతాడు. ఇది జరిగే అవకాశాలు చాలా తక్కువ. ఇక పేసర్లుగా జస్ప్రీత్ బుమ్రా, అర్ష్ దీప్ సింగ్ జట్టులో ఉండడం ఖాయం. మూడో పేసర్ హార్దిక్ పాండ్యా ఉండనే ఉన్నాడు. హర్షిత్ రాణా బెంచ్ లో ఉంటాడు.

భారత తుది జట్టు (అంచనా):

శుభ్ మన్ గిల్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, సంజూ శాంసన్ (కీపర్), అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అర్ష్ దీప్ సింగ్.

బెంచ్ ప్లేయర్స్: రింకూ సింగ్ , శివమ్ దూబె, హర్షిత్ రాణా, జితేష్ శర్మ.


# ప్రపంచకప్ జట్టులో శ్రీచరణి



ఇంగ్లండ్ టూర్ లో ఆకట్టుకొన్న తెలుగమ్మాయి శ్రీచరణికి జాక్ పాట్ తగిలింది. మంగళవారం ప్రకటించిన మహిళల వన్డే వరల్డ్ కప్ జట్టులో ఆమెకు చోటుదక్కింది. ఫిట్ నెస్ సాధించిన పేసర్ రేణుక సింగ్ జట్టులోకి పునరాగమనం చేసింది. టాపార్డర్ లో ప్రతికా రావల్ కు చాన్స్ దక్కగా.. షఫాలీకి సెలెక్టర్లు మొండిచేయి చూపారు. కెప్టెన్ గా హర్మన్ ప్రీత్ కౌర్ , వైస్ కెప్టెన్ గా స్మృతి మంధాన వ్యవహరించనున్నారు. భారత్ , శ్రీలంకల్లో వచ్చే నెల 30 నుంచి వరల్డ్ కప్ జరగనుంది. కాగా ఇటీవలే ఇంగ్లండ్ తో జరిగిన ఐదు టీ20 మ్యాచ్ ల సిరీస్‌లో 10 వికెట్లు పడగొట్టిన కడప జిల్లాకు చెందిన శ్రీచరణి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గానూ ఎంపికైంది. కాగా, మెగా టోర్నీకి ముందు.. అంటే సెప్టెంబరు 14 నుంచి ఆస్ట్రేలియాతో జరిగే మూడువన్డేల సిరీస్ కోసం కూడా భారత జట్టును సెలెక్టర్లు ప్రకటించారు. ఇంగ్లండ్ పర్యటనలో ఆడిన జట్టును దాదాపుగా ప్రపంచక్ పనకు ఎంపిక చేశారు. ఒక్క మార్పు మినహా విశ్వకప్ జట్టునే ఈ సిరీస్‌కూ ఖరారు చేశారు. ఆల్ రౌండర్ అమన్ జోత్ కౌర్ స్థానంలో ఆసీస్ తో వన్డేలకు సయాలీ సత్ ఘరేను తీసుకొన్నారు. గాయంతో బాధపడుతున్న అమన్ జోత్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ లో పునరావాసంలో ఉంది. ప్రపంచకప్ సమయానికి ఆమె కోలుకొనే అవకాశం ఉంది. యువ సీమర్ క్రాంతి గౌడ్ , అరుంధతిలకు కూడా టీమ్ లో చోటు లభించింది. శ్రీచరణితోపాటు దీప్తి శర్మ, రాధా యాదవ్ , స్నేహ్ రాణాలతో స్పిన్ విభాగం బలంగా కనిపిస్తోంది.

**భారత మహిళల వరల్డ్ కప్ జట్టు**


హర్మన్ ప్రీత్ కౌర్ (కెప్టెన్ ), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్ ), ప్రతికా రావల్ , హర్లీన్ డియోల్ , దీప్తి శర్మ, జెమీమా రోడ్రిగ్స్ , రేణుక సింగ్ ఠాకూర్ , అరుంధతి, రిచా ఘోష్ (వికెట్ కీపర్ ), క్రాంతి గౌడ్ , అమన్ జోత్ కౌర్ , రాధా యాదవ్ , శ్రీచరణి, యాస్తిక భాటియా (వికెట్ కీపర్ ), స్నేహ్ రాణా.



## రష్మికకు స్వర్ణం మనుకు కాంస్యం

**భారత స్టార్ షూటర్ మను భాకర్ ఆసియా చాంపియన్ షిప్‌లో పతకం సాధించింది. సీనియర్ విభాగం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్ ఫైనల్స్ లో 219.7 పాయింట్లు స్కోరు చేసిన మను.. మూడోస్థానంలో నిలిచి కాంస్యం అందుకుంది. ఇక, ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్ లో పాలక్ , సురుచి సింగ్ లతో కలిసి మను భాకర్ కాంస్యం నెగ్గి రెండో పతకం ఖాతాలో వేసుకుంది. అలాగే జూనియర్ బాలికల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత ఈవెంట్ లో భారత అమ్మాయి రష్మి సాగల్ స్వర్ణం కొల్లగొట్టింది. ఇదే విభాగం టీమ్ ఈవెంట్ లోనూ రష్మిక.. వంశిక, మోహినిలతో కలిసి పసిడి నెగ్గి గోల్డెన్ డబుల్ సాధించింది. కాగా, యూత్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కనక్ స్వర్ణం, ఆగమ్ గ్రేవాల్ రజతం నెగ్గారు. ఇక, టీమ్ ఈవెంట్ లో భారత జట్టు పసిడి సాధించింది. జూనియర్ బాలుర ఎయిర్ పిస్టల్ లో గవిన్ కాంస్యం అందుకోగా.. యూత్ పురుషుల ఎయిర్ పిస్టల్ లో గిరీష్ స్వర్ణం, దేవ్ ప్రతాప్ కాంస్యం గెలిచారు. ఇక, యూత్ పురుషుల టీమ్ ఈవెంట్ లోనూ భారత జట్టు పసిడి సాధించడం విశేషం.**

# సెమీస్‌లో స్వియటెక్ జోడీ



యూఎస్ ఓపెన్ మిక్స్ డ్ డబుల్స్ చాంపియన్ షిప్‌లో స్వియటెక్ , డిఫెండింగ్ చాంప్ సారా ఎరాని జంటలు సెమీస్ చేరుకొన్నాయి. క్వార్టర్స్ లో స్వియటెక్ -కాస్పర్ రూడ్ ద్వయం 4-1, 4-2తో కేటీ మెక్ నెల్లీ-ముసెట్టి జంటపై గెలిచింది. తొలిరౌండ్ లో కీన్ -టియాఫోపై స్వియటెక్ జోడీ గెలిచింది. క్వార్టర్స్ లో ఎరాని-వవస్సోరి జంట 4-1, 5-4(4)తో ముచోవా-రుబ్లేవ్ పై నెగ్గింది. మొదటి రౌండ్ లో రిబకినా-ఫ్రిట్జ్ పై 4-2, 4-2తో ఎరాని జంట నెగ్గింది. కాగా, వీనస్ విలియమ్స్ -రిల్లీ ఒపెల్కా 2-4, 4-5(2)తో ముచోవా-రుబ్లేవ్ ద్వయం చేతిలో, ఒసాక-మోన్ ఫిల్స్ జోడీ 3-5, 2-4తో కేటీ-ముసెట్టి జంట చేతిలో తొలి రౌండ్ లోనే ఓడారు.



# కేశవ్ పాంచ్

ఆస్ట్రేలియా పర్యటనలో మూడు వన్డేల సిరీస్ ను దక్షిణాఫ్రికా ఘనంగా బోణీ చేసింది. మంగళవారం జరిగిన మొదటి మ్యాచ్ లో లెఫ్టామ్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్ (5/33) కెరీర్ బెస్ట్ గణాంకాలు నమోదు చేయడంతో సఫారీ జట్టు 98 పరుగుల తేడాతో ఆతిథ్య ఆసీస్‌కు షాకిచ్చింది. తొలుత దక్షిణాఫ్రికా.. ఓపెనర్ మార్ క్రమ్ (82), కెప్టెన్ బవుమా (65), మాథ్యూ బ్రెజెకె (57) అర్ధ సెంచరీలతో 50 ఓవర్లలో 8 వికెట్లకు 296 పరుగులు చేసింది. హెడ్ 4, డ్వార్షుయిస్ 2 వికెట్లు తీశారు. ఛేదనలో సఫారీ బౌలర్లు కేశవ్ కు తోడు ఎంగిడి (2/28), బర్గర్ (2/54) ధాటికి ఆసీస్ 40.5 ఓవర్లలో 198 పరుగులకే కుప్పకూలింది. సారథి మిచెల్ మార్ష్ (88) ఒంటరి పోరాటం చేశాడు. ఐదు వికెట్లతో అదరగొట్టిన కేశవ్ కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# బిజినెస్

## ఇన్వెస్టర్లకు వీటితో ఎన్ని లాభాలో తెలుసా..?

ప్రముఖ క్రిప్టో కరెన్సీ అయిన బిట్ కాయిన్ ఇటీవల వరుసగా ఆల్ టైం గరిష్ఠ ధరలకు పెరుగుతున్న క్రమంలో చాలా మంది క్రిప్టో ఇన్వెస్ట్మెంట్లపై ఆసక్తిని పెంచుకుంటున్నారు. అసలు క్రిప్టోల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఏఏ మార్గాలు ఉన్నాయని అన్వేషిస్తున్నారు. వేలు లక్షల్లో పెట్టుబడి పెట్టలేకపోయినప్పటికీ కనీసం 100 రూపాయలతో కూడా ఇన్వెస్టమెంట్ స్టార్ట్ చేయాలనుకునే వారి కోసం కూడా కొన్ని మార్గాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ క్రమంలో క్రిప్టోల్లో ఎస్ఐపీ పెట్టుబడులతో పాటు క్రిప్టోలో పెర్పెట్యూయల్ ఫ్యూచర్స్ ఎక్కువగా ప్రజాధరణను చూస్తున్నాయి.

**అసలు పెర్పెట్యూయల్ ఫ్యూచర్స్ అంటే ఏంటి..?**

పెర్పెట్యూయల్ ఫ్యూచర్స్ అంటే క్రిప్టో కరెన్సీ ధరపై బెట్ వేసే ఒక ప్రత్యేకమైన ఒప్పందం. దీనికి మామూలు ఫ్యూచర్స్ ట్రేడింగ్ లో మాదిరిగా ఎక్స్ పెయిరీ తేదీ ఉండదు. అంటే ట్రేడర్లు తమ పొజిషన్స్ ఎప్పటికి కావాలనుకున్నా ఉంచుకోవచ్చు. సాధారణ ఫ్యూచర్స్ కాంట్రాక్టులు ఒక నిర్దిష్ట తేదీకి ముగుస్తాయి. ఈ విధానంలో పైసా కూడా పెట్టకుండానే క్రిప్టో ధరపై లాభాలు పొందవచ్చు. ధర పెరుగుతుందంటే లాంగ్ పొజిషన్ తీసుకోవచ్చు, తగ్గుతుందంటే షార్ట్ చేసుకోవచ్చు ఇన్వెస్టర్లు. అలాగే లివరేజ్ కారణంగా చిన్న మొత్తంతో కూడా పెద్ద ట్రేడ్స్ చేయొచ్చు. దీన్ని ఉపయోగించి సొంత క్రిప్టో ఎప్పటికప్పుడు అమ్మకుండా, మార్కెట్ లో ఉన్న ప్రమాదం నుంచి రక్షణ పొందవచ్చు.భారతదేశంలోని కొన్ని క్రిప్టో ఏజెన్సీలు మాత్రమే ప్రస్తుతం ఈ పెర్పెట్యూయల్ ఫ్యూచర్స్ క్రిప్టో ట్రేడర్లకు ఆఫర్ చేస్తున్నాయి. తాజాగా ఈ జాబితాలో జియోటస్ క్రిప్టో ఎక్స్చేంజీ కూడా చేరింది. లాంచ్ ఆఫర్ కింద సెప్టెంబర్ 30, 2025 వరకు ట్రేడింగ్ పై ఎలాంటి ఛార్జీలు కూడా లేకుండా అవకాశాన్ని కల్పించిందని సీఈవో విక్రమ్ సుబ్బురాజ్ చెప్పారు. అలాగే ఇన్వెస్టర్లు కనీసం రూ.100తో తమ ట్రేడింగ్ జర్నీ స్టార్ట్ చేయొచ్చని ఆయన చెబుతున్నారు.



# భారత వస్తువులపై ప్రభావం..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన కొత్త సుంకాల కారణంగా భారతదేశ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇది ప్రధానంగా మన దేశ వ్యాపారులకు, ఎగుమతిదారులకు చాలా దెబ్బ అని చెప్పవచ్చు. ఈ సుంకాల వల్ల సుమారు $48.2 బిలియన్ విలువైన భారత వస్తువులు ప్రభావితం కాబోతున్నాయని కామర్స్ మంత్రిత్వ శాఖ తాజాగా అంచనా వేసింది.అంటే దాదాపు రూ. 4.19 లక్షల కోట్ల విలువైన ఎగుమతులు. ఇది చిన్న విషయం కాదు. చాలా పెద్ద మొత్తమని చెప్పవచ్చు. అయితే ప్రధానంగా ఏ రంగాలపై ప్రభావం ఉంటుంది, ఏంటనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.మీరు షాపింగ్ కి వెళ్లినప్పుడు ఒక షర్టు కొనాలనుకుంటే, దానికి ట్యాక్స్ కట్టాలి. అలాగే, ఒక దేశం నుంచి మరో దేశానికి వస్తువులు ఎగుమతి చేస్తే, ఆ వస్తువులపై సుంకం (టారిఫ్) విధిస్తారు. అమెరికా ఇప్పుడు భారతదేశం నుంచి వచ్చే కొన్ని వస్తువులపై 25% సుంకాన్ని ఆగస్టు 7 నుంచి విధించింది. కానీ ఆగస్టు 27 నుంచి మరో 25% సుంకం కూడా యాడ్ చేయనుంది. అంటే, మొత్తం 50% సుంకం. ఇది భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

టెక్స్ టైల్స్ & దుస్తులు: మన దేశం నుంచి అమెరికాకు వెళ్లే దుస్తులు, బట్టలు ఈ సుంకాల వల్ల ఖరీదైనవిగా మారతాయి. దీంతో అమెరికన్ కొనుగోలుదారులు వియత్నాం, బంగ్లాదేశ్ వంటి దేశాల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసే అవకాశం ఉంది.

రత్నాలు & ఆభరణాలు: భారతదేశ ఆభరణాల ఎగుమతుల్లో 30% అమెరికాకు వెళ్తాయి. ఈ సుంకాల వల్ల ఈ రంగం ఎక్కువగా దెబ్బ తినే అవకాశం ఉంది.

ఇంజనీరింగ్ వస్తువులు: ఇనుము, ఉక్కు, ఆటో కాంపోనెంట్స్ వంటివి కూడా ఈ జాబితాలో ఉన్నాయి. ఈ రంగానికి దాదాపు $4-5 బిలియన్ నష్టం వాటిల్లవచ్చని అంచనా.

మెరైన్ ఉత్పత్తులు & రసాయనాలు: రొయ్యలు, రసాయన ఉత్పత్తులు కూడా ఈ సుంకాల బారిన పడతాయి.

ఫార్మాస్యూటికల్స్ (మందులు), సెమీకండక్టర్లు, ఎనర్జీ ఉత్పత్తులు వంటి కొన్ని రంగాలకు ఈ సుంకాల నుంచి మినహాయింపు ఇచ్చారు. అంటే, మన జనరిక్ మందులు, స్మార్ట్ ఫోన్ లు ఇప్పటివరకు సేఫ్ అని చెప్పవచ్చు.


**ఎందుకు ఈ సుంకాలు?**

ట్రంప్ ఈ సుంకాలను విధించడం వెనుక ప్రధాన కారణం. భారతదేశం రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడం. అమెరికా దృష్టిలో ఈ కొనుగోళ్లు రష్యా యుద్ధ విధానానికి ఆర్థిక సహాయం చేస్తున్నాయని ఆరోపణ. అంతేకాదు, భారతదేశం అమెరికా వస్తువులపై అధిక సుంకాలు విధిస్తోందని, దీన్ని సమతూకం చేయడానికి ఈ రెసిప్రొకల్ టారిఫ్ లను ప్రవేశపెట్టినట్లు ట్రంప్ చెబుతున్నారు. అమెరికాతో మన దేశ వాణిజ్య లోటు (ట్రేడ్ డెఫిసిట్) $45.7 బిలియన్ల వరకు ఉంది. దీన్ని తగ్గించాలని ట్రంప్ భావిస్తున్నారు.

**భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం ఎంత?**

ఈ సుంకాల వల్ల మన ఎగుమతులు సుమారు 1.87% తగ్గవచ్చని, GDP పెరుగుదల 0.2-0.5% వరకు తగ్గవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. అంటే, మన GDP పెరుగుదల 6.5% నుంచి 6% కంటే తక్కువకు పడిపోవచ్చు. భారత ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా దేశీయ మార్కెట్ పై ఆధారపడుతుంది కాబట్టి, ఈ ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని కొందరు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ చిన్న, మధ్య తరహా సంస్థల (MSMEs), టెక్స్ టైల్స్, ఆభరణాల వంటి రంగాలకు కష్టమవుతుంది.

# భారీగా పడిపోయిన పసిడి ధరలు..!



ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా మహిళలు బంగారు అభరణాలు ధరిస్తారు. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని మహిళలందరూ బంగారానికి ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తారు. అనేక రకాల డిజైన్లతో లక్షల్లో విలువ చేసే కమ్మలు, నెక్లెస్లు, బ్యాంగిల్స్ వంటివి కొనుగోలు చేస్తుంటారు. ఆడవాళ్లకు ప్రతిరోజూ షాపింగ్ చేసిన బోర్ కొట్టదనడంలో ఎటువంటి సందేహం లేదని చెప్పవచ్చు. కాగా గోల్డ్ రేట్లు ఎప్పుడెప్పుడు తగ్గుతాయా? అంటూ మహిళలు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. కాస్త పసిడి ధరలు తగ్గుముఖం పట్టగానే బంగారం షాపుల్లో ఎగబడుతారు.అయితే ఇటీవల బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు జరుగుతోన్న విషయం తెలిసిందే. ఈ రేట్లతో మహిళల్లో ఓసారి ఉత్సాహం నెలకొనగా... మరోసారి నిరాశకు గురవుతుంటారు. ముఖ్యంగా ఈ మధ్య కాలంలో బంగారం రేట్లు భారీగా పెరుగుతున్నాయి. కొంచెం తగ్గగానే డబుల్, త్రిబుల్ ధర పెరుగుతుంది. ఇవాళ గోల్డ్ ప్రియులకు కాస్త ఊరట లభించింది. నిన్న 22 క్యారెట్లు.. 10 గ్రాముల బంగారం రూ. 92, 350 ఉండగా.. నేడు రూ. 550 తగ్గి రూ. 91, 800గా ఉంది. ఇక నిన్న 24 క్యారెట్లు 10 గ్రాముల బంగారం ధర రూ. 1,00,750 గా ఉంది. నేడు రూ. 600 తగ్గి రూ. 1, 00,150 గా ఉంది. కాగా ఈ నేపథ్యంలో నిన్నటి ధరతో పోలిస్తే ఇవాళ పసిడి ధరల్లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

# యూజర్లకు ఎయిర్‌టెల్ షాక్..




టెలికాం రంగంలో మరో భారీ మార్పు జరిగింది. జియో 1 జీబీ డేటా ప్లాన్ ను ఆపేసిన కొద్దిసేపటికే, ఎయిర్ టెల్ కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తూ.. వినియోగదారులకు బిగ్ షాక్ ఇచ్చింది. ఇక, రూ.249 ఎంట్రీ లెవల్ ప్రీపెయిడ్ ప్లాన్ ను రద్దు చేస్తున్నట్లు వెల్లడించింది. దీంతో ఆగస్టు 20వ తేదీ నుంచి ఈ ప్లాన్ కస్టమర్లకు అందుబాటులో ఉండదని పేర్కొనింది. ఇక, వొడాఫోన్ ఐడియా కూడా ఇలాంటి నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉందని విశ్లేషకులు తెలియజేస్తున్నారు.కాగా, ప్రస్తుతం ఎయిర్ టెల్ రూ.249 ప్యాక్ లో 24 రోజుల వ్యాలిడిటీతో పాటు రోజుకు 1 జీబీ డేటా, అన్ లిమిటెడ్ కాల్స్ అందిజేస్తోంది. కానీ, ఈ ప్లాన్ రద్దైన తర్వాత, యూజర్లు కనీసం రూ.319 రీఛార్జ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కొత్త ప్యాక్ నెల రోజుల వ్యాలిడిటీతో కొనసాగుతుంది. కాగా, వొడాఫోన్ ఐడియా మాత్రం రూ.299కు రోజుకు 1 జీబీ డేటా ప్లాన్ అందజేస్తుంది. అయితే, రిలయన్స్ జియో విషయాని వస్తే, ప్రస్తుతం జియో వెబ్ సైట్ లో రూ.299 (1.5 జీబీ/డే – 28 రోజులు) బేస్ ఆప్షన్ గా తీసుకు రాగా, రూ.349 (2 జీబీ/డే – 28 రోజులు) ప్లాన్లు మాత్రమే అందుబాటులో ఉంచింది.అయితే, టెలికాం సంస్థలు ARPU పెంచుకోవడం కోసమే ఈ ప్లాన్స్ రద్దు చేసినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఎంట్రీ లెవల్ ప్లాన్లు తొలగించడంతో కస్టమర్లు అధిక డేటా ప్లాన్లకు మారాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రస్తుతం జియో యూజర్లలో 20-25 శాతం మంది, ఎయిర్ టెల్ యూజర్లలో 18-20 శాతం మంది ఎంట్రీ లెవల్ 1 జీబీ ప్లాన్ ను ఉపయోగిస్తున్నారని అంచనా. ఈ మార్పులతో కంపెనీల ఆదాయం 4-7 శాతం పెరిగుతాయి.. సగటు ఆదాయం రూ.10-13 మేర పెరిగే ఛాన్స్ ఉందని బ్రోకరేజీ సంస్థలు పేర్కొంటున్నాయి.

FLASH INDIA TELUGU DAILY
RNI NO. APTEL/2010/33229

# నా దృష్టిలో సక్సెస్ అంటే.. తృప్తిపరచడమే



అందం, అభినయం, ఆత్మవిశ్వాసం కలగలసిన నటి మృణాల్ ఠాకూర్. బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ 'సీతారామం', 'హాయ్ నాన్న' వంటి చిత్రాల్లో తన గ్లామర్ తో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకుం ది. ప్రస్తుతం ఆమె 'డెకాయిట్' సినిమాలో నటిస్తుంది. అయితే ఈ మధ్య పలు వివాదాలతో మృణాల్ తరచూ వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే.. ఇక తాజాగా సక్సెస్ అంటే ఏమిటి? అనే ప్రశ్నకు ఆమె ఇచ్చిన సమాధానం మరోసారి హాట్ టాపిక్ గా మారింది.మృణాల్ మాట్లాడుతూ.. 'ఒక సినిమా ఎన్ని కోట్లు కలెక్ట్ చేసింది? ఎంత బడ్జెట్ పెట్టారన్నది కూడా నాకు ముఖ్యం కాదు. నేను ఆ సినిమాలో మంచి ప్రదర్శన ఇచ్చానా లేదా? అదే నాకు ముఖ్యం. నేను బాగా నటిస్తే, సినిమా ఫలితం ఎలా ఉన్నా నా దృష్టిలో అది సక్సెస్ అన్నట్లే. అంటే ప్రేక్షకులను తృప్తి పరచడ మే నా దృష్టిలో నిజమైన సక్సెస్. కానీ డబ్బుతో సక్సెస్ ని కొలిస్తే అది ఎప్పటికప్పుడు మారిపోతుంది. మనసు తృప్తిపడే లా నటిస్తే అదే అసలైన విజయమని నమ్ముతాను. నేను నటనలో ఫెయిల్ అవ్వకూడదు. ప్రేక్షకులకు తెరపై మనం ఎప్పుడు బోర్ కొడతామో అది నిజమైన ఫెయిల్యూర్' అని తెలిపింది మృణాల్. ప్రజంట్ ఈ అమ్మడు మాటలు వైరల్ అవుతున్నాయి.



# లోకేష్ డిమాండ్ ...'ఖైదీ 2' వాయిదా..?


2019లో విడుదలైన 'ఖైదీ' సినిమా హీరో కార్తి కెరీర్ లో మైలురాయిగా నిలిచింది. ఒక్క రాత్రి నేపథ్యంలో ఎలాంటి పాటలు లేకుండా, హీరోయిన్ లేకుండా..కోలీవుడ్ టాలెంటెడ్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ తెరకెక్కిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుత విజయాన్ని సాధించింది. థ్రిల్లింగ్ కథనం, కర్తి పవర్ ఫుల్ నటన కలిసి సినిమాను కల్ట్ స్టేటస్ కి చేర్చాయి. అప్పటి నుంచి ఈ చిత్రానికి సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, తాజా సమాచారం ప్రకారం ఈ సీక్వెల్ వాయిదా పడిందన్న వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. కారణం ఏమిటంటే..లోకేష్ తాను ప్రస్తుతం రజినీకాంత్–కమల్ హాసన్ లతో భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ ను ప్లాన్ చేస్తున్నాడట. దీంతో 'ఖైదీ 2' తాత్కాలికంగా వెనక్కి వెళ్లిందని టాక్. ఇక మరో కారణం కూడా వినిపిస్తోంది. ఏంటంటే 'ఖైదీ 2'కి ఉన్న హైప్ ను పూర్తిగా క్యాష్ చేసుకోవాలని లోకేష్ భావించినట్టు సమాచారం. కూలీ సినిమాకు ఆయన రూ.50 కోట్ల రూపాయల పారితోషికం తీసుకున్నట్లు తానే చెప్పాడు. మరి అంతకు మించిన క్రేజ్ ఉన్న 'ఖైదీ 2' కోసం 75 కోట్ల డిమాండ్ పెట్టాడట. హీరోల కంటే ఎక్కువ రెమ్యునరేషన్ అడగడంతో చర్చలు నడుస్తున్నట్లుగా టాక్. అయితే ఈ వార్తలు ఎంతవరకు నిజమో ఇంకా క్లారిటీ లేదు కానీ ప్రజంట్ ఈ వార్త మాత్రం వైరల్ అవుతుంది.

# నా కెరీర్ మారింది

కెరీర్ బిగినింగ్ లో ఈ ముద్దుగుమ్మ చాలా పద్ధతిగా నడుచుకున్నప్పటికి , ఇప్పుడు పూర్తిగా రూట్ మార్చింది.. ముఖ్యంగా బోల్డ్ సీన్స్ లో రెచ్చిపోతుంది.. దీని కారణం తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది తమన్నా..ఒక తాజా ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ.. "నేను ఎప్పటినుంచో కసరత్తులు చేస్తూ ఉన్నా. కానీ నాకు శరీరం ఏం చెబుతుందో అదే చేస్తాను. బలవంతంగా ఏదీ చేయను. అలసటగా ఉన్నా, నిద్ర సరిగా లేకపోయినా, వర్కౌట్ మానేసి విశ్రాంతిని ప్రాధాన్యం ఇస్తాను" అని చెప్పారు. అలాగే, తనకు ప్రశాంతమైన ప్రదేశాలు, ధ్యానం చేయడం, దేవాలయాలకు వెళ్లడం చాలా ఇష్టమని తెలిపారు. ఇటీవల కాశీ యాత్ర తన జీవితంలో మర్చిపోలేని అనుభవమని, ఆ నగరంలోని ఆధ్యాత్మిక వాతావరణం తన మనసును ఎంతగానో ఆకట్టుకుందన్నారు. అలాగే తన కెరీర్ పై ఓపెన్ గా మాట్లాడుతూ.. "నాకు గ్లామరస్ నటిగా ముద్ర వేసేశారు. కెరీర్ ప్రారంభంలోనే కొన్ని నిబంధనలు పెట్టుకోవడంతో శక్తివంతమైన పాత్రలను కోల్పోయాను. నో-కిస్ పాలసీని కఠినంగా పాటించాను. కానీ ఆ ఆంక్షలు వదిలేసిన తర్వాత బోల్డ్ అండ్ గ్లామరస్ రోల్స్ చేయడం మొదలెట్టాను. అదే నా కెరీర్ టర్నింగ్ పాయింట్ అయింది" అని స్పష్టం చేశారు.




# మరోసారి వాయిదా పడిన మిరాయ్




యంగ్ హీరో తేజా సజ్జా, డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేని కాంబినేషన్ లో వస్తున్న లేటెస్ట్ భారీ బడ్జెట్ మూవీ 'మిరాయ్'. ఈ పాన్ ఇండియా చిత్రం నుంచి ఇప్పటికే వచ్చిన ప్రతి అప్డేట్ ప్రేక్షకులను ఆకట్టుకోగా.. సినిమా రిలీజ్ కోసం ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. కానీ ఎప్పటికప్పుడు ఈ మూవీ వాయిదా పడుతూ ఆడియన్స్ ను నిరుత్సాహపరుస్తుంది. ఇక షూటింగ్ పనులు పూర్తి కాగా.. ఎట్టకేలకు ఈ మూవీ భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు సిద్ధంగా ఉందని మేకర్స్ అఫీషియల్ అనౌన్స్ మెంట్ ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ ఇప్పుడు మరోసారి ఈ సినిమా వాయిదా పడినట్లు తెలుస్తోంది.అదే రోజున అనుష్క ఘాటీ సినిమా రిలీజ్ ఉండటంతో.. మిరాయ్ ని వాయిదా వెయ్యాలని ఫిక్స్ అయ్యారట మూవీ టీమ్. ఈ మేరకు సెప్టెంబర్ 5వ తేదీన రిలీజ్ కావాల్సిన సినిమాను వాయిదా వేస్తూ.. సెప్టెంబర్ 12కు పోస్ట్ పోన్ చేసినట్లు నెట్టింట పోస్టులు వైరల్ అవుతున్నాయి. అయితే.. దీనిపై టీమ్ అఫీషియల్ అనౌన్స్ మెంట్ ఇవ్వాల్సి ఉంది. కాగా.. ఈ పాన్ ఇండియా చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తుండగా.. మంచు మనోజ్ విలన్ గా మెప్పించనున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు.

# తమిళ ఇండస్ట్రీకి ఎంట్రీ



మల్టీ టాలెంటెడ్ గా ఇండస్ట్రీలో దూసుకుపోతున్న రాఘవ లారెన్స్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'కాంచన-4'. ఆయన సొంతం దర్శకత్వంలో తెరకెక్కి బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న 'ముని' ఫ్రాంచైజీలో రాబోతున్న ఈ హారర్ థ్రిల్లర్ కామెడీ చిత్రాన్ని గోల్డ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మించనున్నారు. ఇక ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోన్న ఈ మూవీలో నోరా ఫతేహి, పూజా హెగ్డే హీరోయిన్స్ గా నటిస్తున్న నెట్టింట వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. కానీ చిత్రం బృందం మాత్రం దీనిపై ఇప్పటి వరకు అఫీషియల్ అనౌన్స్ మెంట్ ఇవ్వలేదు. అయితే.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న బోల్డ్ బ్యూటీ నోరా ఫతేహి ఈ వార్తలపై క్లారిటీ ఇచ్చింది.'రాఘవ లారెన్స్ దర్శకత్వంలో వస్తున్న కాంచన-4 చిత్రంతో నేను తమిళ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇవ్వడానికి చాలా ఉత్సాహంగా ఉన్నాను. ఈ సినిమాలోని వచ్చే హారర్ అండ్ కామెడీ సీన్స్ తో నా నటనను, అలాగే డ్యాన్స్ స్కిల్స్ ను ప్రదర్శించడానికి ఇది నాకు సరైన ప్రాజెక్ట్ అని నా అభిప్రాయం. ఈ చిత్రంలో పూజా హెగ్డే, లారెన్స్ తో నటించడం చాలా సంతోషంగా ఉంది' అని తెలిపింది.

# మొదటి సారి ఆ అనుభవం

' స్కూల్ లో 9వ తరగతిలో ఉన్నప్పుడు టీచర్లు పీరియడ్స్ గురించి చెప్పేవారు. కానీ చాలా మందికి అది 8వ తరగతిలోనే వస్తుంది. నేను అప్పుడు పూర్తిగా అర్థం చేసుకోలేకపోయాను. మా అమ్మ కూడా ఈ విషయంపై నాకు ఎప్పుడూ చెప్పలేదు. టీవీలో వచ్చే శానిటరీ ప్యాడ్ ప్రకటనల ద్వారానే కొంత తెలుసుకున్నాను. నా క్లాస్ లోని చాలా అమ్మాయిలకు పీరియడ్స్ వచ్చాయి. కానీ నాకు రాలేదు. ఒకసారి మా అమ్మ అడిగింది – 'ఇంకా రాలేదా?' అని. నేను లేదు అన్నప్పుడు ఆమె చాలా టెన్షన్ పడింది. ఆ సమయంలో నేను బొమ్మలతో ఆడుకునేదాన్ని. ఒక రోజు కోపంతో అమ్మ నా బొమ్మలన్నీ బయటికి విసిరేసింది. తర్వాత 'నీకు ఒక రోజు పీరియడ్స్ వస్తాయి, రక్తం కనిపిస్తే వెంటనే నా దగ్గరకు రావాలి' అని చెప్పారు. ఒక రోజు ఉదయం నిద్ర లేచి చూసేసరికి బెడ్ షీట్ మొత్తం రక్తంతో నిండిపోయింది. నేను భయపడి ఏడవడం మొదలు పెట్టాను. కానీ అమ్మ మాత్రం సంతోషపడింది. ఎందుకంటే నాకు చివరికి పీరియడ్ వచ్చింది. నేను మాత్రం ఏడుస్తూనే ఉన్నాను. ఇకపై ప్రతి నెల ఇదే జరుగుతుందా? అని భయపడ్డాను. ఆ సమయంలో నాకు భయం వేసింది. ఇకపై నాన్న నన్ను ఒడిలో కూర్చోనివ్వరేమో, అమ్మ నన్ను హత్తుకోదేమో అనిపించింది. నేను మా అమ్మానాన్నలకు దూరం అవుతానని చాలా బాధపడ్డాను' అని కంగనా చెప్పుకొచ్చారు.






# రెండు రోజులు ముందుగానే

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన లేటెస్ట్ మూవీ 'హరిహర వీరమల్లు'. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ గా తెరకెక్కిన ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించగా.. ఏఎమ్ రత్నం భారీ బడ్జెట్ తో నిర్మించారు. ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందించాడు. నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించింది. పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎన్నో అంచనాలు పెట్టుకున్న ఈ చిత్రం.. భారీ అంచనాల మధ్య జులై 24న థియేటర్స్ లో రిలీజైంది. కానీ, ఊహించిన రేంజ్ లో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో.. బాక్సాఫీస్ వద్ద యావరేజ్ గా నిలిచింది.దీంతో నిర్మాతలకు సైతం నష్టాలు వచ్చినట్లు తెలుస్తుంది. ఇదిలా ఉంటే.. 'హరిహర వీరమల్లు' చిత్రం రిలీజై ఇంకా నెల కూడా కాముందే ఓటీటీ అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోస్ సొంతం చేసుకోగా.. ఆగస్టు 22 నుంచి స్ట్రీమింగ్ కు రాబోతున్నట్లు గత కొద్ది రోజులుగా నెట్టింట వార్తలు వైరల్ అవుతున్న సంగతి తెలిసిందే. ఇక తాజాగా దీనిపై అఫీషియల్ అనౌన్స్ మెంట్ కూడా వచ్చేసింది. అయితే.. రెండు రోజులు ముందుగానే స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటిస్తూ.. 'తిరుగుబాటు, కోపం.. అండ్ నీతి కథ.. థియేటర్లలో స్టార్ట్ అయిన తుఫాను ఇప్పుడు మీ స్క్రీన్లను ఆక్రమించింది.. ఆగస్టు 20 నుండి హరిహరవీరమల్లు స్వోర్డ్ vs స్పిరిట్ అమెజాన్ ప్రైమ్ వీడియోస్ లోకి మాత్రమే రాబోతుంది' అంటూ ప్రకటించారు.

# నా కల నిజమైంది..

కన్నడ సొగసరి రుక్మిణి వసంత్ కు కెరీర్ లో పెద్ద బ్రేక్ రావడానికి కొంత సమయం పట్టింది. అయితే రెండు సంవత్సరాల క్రితం వచ్చిన 'సప్త సాగరాలు దాటి' సినిమా ఆమె సినీ ప్రయాణాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ చిత్రంలో ఆమె నటనకు వచ్చిన ప్రశంసలు, ఆ తర్వాత వరుస అవకాశాలకు బాటలు వేసాయి. ప్రస్తుతం ఈ భామ చేతిలో ఉన్నవన్నీ భారీ చిత్రాలే.ఇందులో ముఖ్యంగా 'కాంతార చాప్టర్-1' ప్రాజెక్ట్ ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ సినిమాలో రుక్మిణి కనకావతి అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన ఆమె ఫస్ట్ లుక్ మంచి హంగామా సృష్టించింది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో రుక్మిణి మాట్లాడుతూ.. "రిషబ్ శెట్టి సర్ నన్ను సినిమా కోసం సంప్రదించినప్పుడు, నిజంగా ఆనందానికి అవధులు లేకుండా పోయింది. నా కల నిజమైనట్టే అనిపించింది. ఈ సినిమా నా కెరీర్ లో ప్రత్యేక స్థానం సంపాదించబోతుంది. చిత్రబృందం కోరుకున్నందువల్ల ఇప్పటివరకు నా పాత్ర గురించి ఎక్కడా చెప్పలేదు. కానీ ఇప్పుడు ఫస్ట్ లుక్ రాగానే అందరికీ తెలిసిపోయింది" అని చెప్పుకొచ్చారు. ప్రజంట్ ఈ అమ్మడు చేతిలో ఉన్న ప్రాజెక్ట్ లలో ఎన్టీఆర్ సరసన 'డ్రాగన్' ఒక్కటి, తమిళంలో 'మదరాసి', కన్నడంలో యష్ హీరోగా వస్తున్న 'టాక్సిక్' ఈ వరుస ప్రాజెక్టులు చూస్తుంటే, రుక్మిణి వసంత్ కెరీర్ గ్రాఫ్ మరింత ఎత్తుకు చేరనుంది అనడం ఖాయం.



Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**